సాంఖ్య దార్శనికుడు

# కపిల మహర్షి

(నిరాపేక్షతో నిరాశను గెలవవచ్చని ప్రతిపాదించిన సనాతన శాస్త్రజ్ఞుడు)


**రచన**

'స్వధర్మయోగి' డా॥ సి.వి.రావు

(డా॥ చుక్కపల్లి వెంకట్రావు)



కపిలమహర్షి రిసెర్చ్ ఫర్ రిసోర్సెస్

హైదరాబాదు

# Sankhya Darsanikudu
# Kapila Maharshi (Telugu)

**by Dr. C.V.Rao**

Second Edition: April 2019
Copies: 3000

© Kapila Maharshi Research for Resources (KMRR)

Printed at : Pragathi Offset Pvt. Ltd. Hyderabad.
Editing : Sri M.B.S. Prasad.
Cartoonist : Sri B. Bhanu Prakash.

**K**apila **M**aharshi **R**esearch for **R**esources
D.No. 8-3-1060/B1, Ground floor
Srinagar Colony
HYDERABAD 500 073
Ph:040-2374 7607 cell: 98499 77607
www.kapilayoga.org
email: contact@kapilayoga.org

For copies: KMRR - Main Office

Price: ₹ 25/-

For your kind feedback: feedback@kapilayoga.org

# అంకితం



పూజ్యనీయులైన తల్లి దండ్రులు

కీ॥శే॥ శ్రీ చుక్కపల్లి కోటయ్య, నాగ రత్నమ్మ గార్లకు

# స్పందన



భారతీయ తత్త్వశాస్త్రంలోని ఆస్తిక దర్శనాలలో జంట దర్శనాలుగా పేరొందినవి సాంఖ్యదర్శనం, యోగదర్శనం. సాంఖ్య దర్శనాన్ని సిద్ధాంత భూమికగానూ, యోగదర్శనాన్ని సాధనమార్గంగానూ స్థూలంగా వర్ణించవచ్చు. రచయిత శ్రీ సి.వి. రావు గారు చెప్పినట్లు సాంఖ్యదర్శనం తర్కబద్ధమైనది. వేదాంతం కూడా తర్కబద్ధమైనదే కానీ అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని తర్కాన్ని జోడిస్తుంది. అందువల్ల వేదాంతశాస్త్రం సాంఖ్యాన్ని పూర్తిగా ఒప్పుకోలేదు.

అయినా సాంఖ్యశాస్త్రంలోని మౌలిక అంశాలైన సత్త్వరజస్తమోగుణాలు, ప్రకృతి – పురుషుడు అనే రెండిటి విశ్లేషణ, కైవల్యం గూర్చిన విశ్లేషణ మొదలైనవాటిని చాలామటుకు ఉపనిషత్ సిద్ధాంతంతో సమన్వయం చేస్తుంది. ఈ సమన్వయాన్ని భగవద్గీతలో చూడగలం. ఈ విషయాన్నే ప్రస్తుత రచయిత తన పుస్తకంలో వివరించారు.

చాల సులభమైన శైలిలో సాంఖ్యతత్త్వంలోని ముఖ్యవిషయాల్ని రచయిత పాఠకులకు అందించాడు. సాఖ్యసిద్ధాంతానికి మూలపురుషుడైన కపిలుడు మన సంప్రదాయంలో విష్ణువు అవతారంగా ఎలా స్వీకరించబడ్డాడు అన్న విషయాన్ని రచయిత వివరించాడు. పుస్తకం పరిమాణంలో చిన్నదైనా వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగించే అనేక విషయాలని రచయిత ఇందులో పొందుపరచడం అభినందనీయం.

**– డా॥ కె. అరవిందరావు**

**మాజీ. డి.జి.పి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్**

## రచయిత ముందుమాట

నేను 1998లో "కపిల మహర్షి రిసెర్చ్ ఫర్ రిసోర్సెస్" (కెఎంఆర్ఆర్) ప్రారంభించినప్పటి నుంచి యిప్పటివరకు నన్ను అందరూ తరచుగా అడిగే ప్రశ్న – 'యోగా సంస్థ అంటే సాధారణంగా పతంజలి పేరు పెడతారు కదా, కపిల మహర్షి పేరు పెట్టారేం? ఆయనెవరు?' అనే వారందరికీ యీ పుస్తకం ద్వారా సమాధానం లభిస్తుందని ఆశిస్తున్నాను.

'యోగ చిత్తవృత్తి నిరోధః' అని ప్రవచించిన పతంజలి యోగసూత్రాలు రచించగా అతని కంటె ఒక శతాబ్ది పూర్వం వాడైన కపిలుడు దానికి నేపథ్యాన్ని, తాత్త్విక భూమికను ఏర్పరచాడు. యోగసాధన అంటే హఠయోగం, ఆసనాలు, శ్వాసపై నియంత్రణ మాత్రమే కాదు. మనసుని అదుపులో పెట్టుకోవడం, తన జన్మ ప్రయోజనాన్ని తెలుసుకుని మోక్షాన్ని సాధించడం కూడా. ఆ విషయాలను కపిలుడు తన సాంఖ్యయోగం ద్వారా ప్రతిపాదించాడు.

కపిలుడి వాదన తర్కబద్ధమైనది. శాస్త్రబద్ధమైనది. హేతువాదులకు, భౌతికవాదులకు కూడా చాలావరకు ఆమోదయోగ్యమైనది. ఈనాటి యువతీయువకులు దేనినీ గుడ్డిగా నమ్మరు. ప్రశ్నిస్తారు, తర్కిస్తారు, విశ్వాసం కుదిరితేనే ఆచరిస్తారు. క్రీ.పూ. 3 వ శతాబ్దం నాటి సాంఖ్యయోగం యీనాటి ఆధునిక సమాజాన్నీ ఆకట్టుకునేదే.

దానిని ప్రతిపాదించిన కపిల మహర్షిని నేను ఆదర్శప్రాయుడిగా భావించడం వలననే మా సంస్థకు ఆయన పేరు పెట్టడం జరిగింది. ఆయన స్ఫూర్తితోనే సామాజిక సేవను కూడా మా సంస్థ లక్ష్యాలలో ఒకటిగా చేర్చడం జరిగింది. ఎందుకంటే వ్యక్తి ఆరోగ్యమే కాదు, సామాజిక ఆరోగ్యం కూడా ముఖ్యమే. మనశ్శాంతి లేనిదే ఏకాగ్రత కుదరదు, మోక్షం లభించదు.

మనశ్శాంతి కలగాలంటే సమాజంలో అన్ని వర్గాల మధ్య సామరస్యం, సమతుల్యత ఉండాలి. బలహీనవర్గాల గురించి, వెనుకబడిన వారిని గురించి వారి కంటె మెరుగ్గా వున్నవారు పట్టించుకున్నపుడే, పరిస్థితి చక్కదిద్దినపుడే సామూహికంగా, వ్యక్తులుగా మనం ఉన్నతస్థాయికి ఎదగగలుగుతాం.

కపిలుడు ప్రతిపాదించిన సాంఖ్యసిద్ధాంతంలో భగవంతుని ప్రసక్తి ఉండదు. బుద్ధుడు కూడా సాంఖ్యం చేత ప్రభావితుడై కొన్ని భావాలను బౌద్ధంలోకి తీసుకున్నాడు. అందువలన దీనిని బౌద్ధంతో, చార్వాక వాదంతో ఒకే గాటన కట్టి నాస్తిక మతంగా ముద్ర వేయడం జరిగింది. క్రమేపీ కపిలుని శిష్యుల

కాలంలో భగవంతుని ఉనికిని ప్రవేశపెట్టడంతో సాంఖ్యం అందరికీ ఆమోదయోగ్యమైంది. కపిలుణ్ని విష్ణువు అవతారంగా భావించారు. సాంఖ్య దర్శనాన్ని భగవద్గీతలో ఒక అధ్యాయంగా కూడా చేర్చారు. దీనిని బట్టి ఆ సిద్ధాంతపటిమ తెలియవస్తుంది.

"నాస్తి సాంఖ్య సమం జ్ఞానం" అని లోకోక్తి. సాంఖ్య దర్శనంతో సమానమైన జ్ఞానం వేరే లేదని దాని అర్థం. కాలదోషం పట్టని సాంఖ్య సూత్రాలకు క్రీస్తుశకం 16వ శతాబ్ది వాడైన విజ్ఞాన భిక్షువు కూడా భాష్యం వ్రాశాడు. 6వ శతాబ్దంలో చైనా భాషలోకి అనువదించారు. అనిరుద్ధుడు మరొక భాష్యకారుడు.

కపిలుడి ప్రాశస్త్యాన్ని వర్ణించడానికి ఒక్క వాక్యం, లేదా ఒక్క మాట చాలు. కృష్ణుడు అర్జునుడితో తను అన్ని విధాలా శ్రేష్ఠుణ్ని అని చెప్పడానికి పదవ అధ్యాయంలో – 'పురోహితుల్లో బృహస్పతిని, సేనానుల్లో కుమారస్వామిని, శబ్దాలలో ఓంకారాన్ని ... అని చెపుతూ 'సిద్ధుల్లో కపిలుణ్ని' అంటాడు. జ్ఞానం సిద్ధించిన వారిలో కపిలుడు బెస్ట్ అనడానికి యింత కంటె వేరే నిదర్శనం కావాలా?

కపిలుడి సాంఖ్యం యీనాటికి కూడా అవసరమే అని భావించడానికి కారణం – దానిలో చెప్పిన స్థితప్రజ్ఞత. ఈనాటి యువతీయువకులు చిన్నపాటి క్లేశాలకే కలత చెందుతున్నారు, టెన్షన్ పడుతున్నారు. కాస్త ఒడిదుడుకులు వచ్చినా తట్టుకోలేక నిరాశకు, డిప్రెషన్‌కు లోనవుతున్నారు. ఆత్మహత్యలకు పాలుపడుతున్నారు. తరం మారిన కొద్దీ శారీరక దారుఢ్యం పెరుగుతోంది, మేధస్సు పెరుగుతోంది కానీ దుఃఖాన్ని తట్టుకునే శక్తి తరుగుతోంది.

కపిలుడు యీ దుఃఖానికి కారణం ఏమిటో చెప్పాడు. ప్రాపంచిక విషయాల నుండి తనను తాను వేరు చేసుకుని, శరీరం అనుభవించే సుఖదుఃఖాలను ఒక ప్రేక్షకుడిగా వీక్షించమన్నాడు. ఈ డిటాచ్‌మెంట్ కలిగినపుడు మనిషి ఆటుపోట్లకు కృంగిపోడు. ఎటువంటి క్లిష్టపరిస్థితుల్లో కూడా బాలన్స్‌డ్‌గా నిలిచే స్థితప్రజ్ఞత అలవర్చుకుంటాడు.

అదే కృష్ణుడి ముఖతః భగవద్గీతలోని సాంఖ్య యోగమనే రెండో అధ్యాయంలో చెప్పించారు. "కర్మణ్యేవాధికారస్తే.." అనే ప్రఖ్యాత శ్లోకం దీనిలోదే. నిష్కామకర్మ (ఫలితంపై ఆశ పెట్టుకోకుండా తన విద్యుక్తధర్మాన్ని తను చేసుకుని పోవడం) గురించి దీనిలోనే చెప్పారు. ఈ డిటాచ్‌మెంట్ అలవడడానికి శరీరంపై, మనసుపై నియంత్రణ అవసరం. అవి యోగా, ధ్యానం ద్వారా సాధ్యపడతాయి. అవి

నేర్పడానికే "కపిల మహర్షి రిసెర్చి ఫర్ రిసోర్సెస్" పని చేస్తున్నది. ఆ విధంగా విలువైన మానవ వనరులు వృథా కాకుండా, తప్పుదారిన పడిపోకుండా, వారి శక్తి, పాటవం పెంపొందేలా కృషి చేస్తోంది.

ఇక్కడ నా సొంత విషయం కూడా ఒకటి చెప్పాలి. నేను చిన్నప్పటి నుంచి కష్టపడి పైకి వచ్చాను. ఒక దశలో జీవచ్ఛవంలా ఉన్న నన్ను యోగాభ్యాసమే మామూలు మనిషిని చేసింది. అప్పణ్నుంచి యోగబోధనే నా స్వధర్మంగా ఎంచి, నాకు ఉపయోగపడిన యోగాభ్యాసం పదిమందికీ పంచాలనే ఆశయంతో స్థాపించిన కెఎంఆర్ఆర్ సంస్థ ద్వారా నేను ఎందరికో పరిచితుడనయ్యాను. స్వధర్మయోగిగా నా కంటూ గుర్తింపు వచ్చింది. ఇదంతా ఒక యెత్తు. కుటుంబంలో జరిగిన విషాదాన్ని స్థిరచిత్తంతో తట్టుకోవడం మరో ఎత్తు.

అమెరికాలో ఉన్నతోద్యోగంలో మా చిన్నకుమారుడు రాజ్ కుమార్ స్థిరపడిన దరిమిలా పెద్దకుమారుడు శరత్‌చంద్ర జర్మనీలో తన ఇంజనీరింగు మాస్టర్స్ చదువు పక్కన పెట్టి వెనక్కి వచ్చి మాకు తోడుగా నిలిచాడు. అతనికి భార్య, కుమారుడు కూడా. 2009లో ఒక రాత్రి జరిగిన యాక్సిడెంటులో తన 32 యేట మా అందరినీ విడిచి వెళ్లిపోయాడు. పుత్రనష్టాన్ని భరించడం సామాన్యమైన విషయం కాదు. కానీ కపిల మహర్షిని ఆరాధిస్తూ, నిత్య యోగాభ్యాసంతో ఆయన సిద్ధాంతాలను ఆచరిస్తూండడం చేత కాబోలు ఎంతో కొంత స్థితప్రజ్ఞత నాకు అంటిందనుకుంటాను. కడుపుకోత రగిలించే దుఃఖాన్ని దిగమింగి, నా కార్యకలాపాలు యథాతథంగా కొనసాగిస్తున్నాను.

చిన్నపాటి కష్టానికి కూడా తల్లడిల్లిపోయేవారికి కపిలుడి బోధనల గురించి వివరిస్తే, వారికీ ఎంతోకొంత మోతాదులో స్థితప్రజ్ఞత అలవడుతుంది కదాని యీ అనుభవం తర్వాత నాకు తోచింది. దేవుడు ఉన్నాడా లేదా, కపిలుడు విష్ణుమూర్తి అవతారం ఔనా కాదా అనే మీమాంసలోకి పెద్దగా వెళ్లదలచుకోలేదు. ఎందుకంటే వాటి గురించి ఎంత తర్కించినా ఎవరూ యితమిత్థమని చెప్పలేరు. కానీ ద్వంద్వాలకు అతీతంగా ఉంటే ప్రాపంచిక దుఃఖాలు బాధించవని ఆయన చెప్పిన సూత్రం యీనాటి సమాజానికీ ఆదరణీయం, ఆచరణీయం, ఆదర్శప్రాయం.

అందుకే కపిలుడి గురించి, ఆయన సాంఖ్యదర్శనం గురించి సామాన్య పాఠకులకు తెలియపరచడానికే యీ పుస్తకాన్ని వ్రాయడం జరుగుతోంది. సాంఖ్యం యొక్క మౌలిక రూపంతో బాటు, భాగవతంలో కపిలుడి కథ,

భగవద్గీతలో చోటు చేసుకున్న సాంఖ్యం గురించి కూడా దీనిలో వివరణ ఉంటుంది. ఒక క్లిష్టమైన దర్శనాన్ని యీనాటి పాఠకులకు అవగతమయ్యే భాషలో చెప్పడం కష్టమైనా ఆ సాహసానికి ఒడికడుతున్నాను.

ఈ ప్రయత్నంలో కీ.శే. నండూరి రామమోహనరావుగారి 'విశ్వదర్శనం', ఉషశ్రీ గారి "భగవద్గీత" నాకెంతో ఉపకరించాయి. వారికి నా ధన్యవాదాలు.


నాకు యోగవిద్యను నేర్పిన గురువర్యులు కీ॥శే॥ రెడ్డి సాంబశివరావు గారికి, నాలో హేతుబద్ధమైన ఆలోచన రేకెత్తించిన కీ॥శే॥ చుక్కపల్లి పిచ్చయ్య గారికి శిరసాభివందనాలు!

అదే విధంగా పుస్తకం రాయడానికి ప్రేరణ కలిగించిన శ్రీ పింగళి పాండురంగారావు గారికి, నా భావాలను సరళమైన భాషలో వ్యక్తీకరించడానికి సహాయపడిన రచయిత, మిత్రులు, మా సంస్థకు ఆత్మీయులు ఐన శ్రీ ఎమ్బీయస్ ప్రసాద్ గారికి కృతజ్ఞతలు. చక్కని రేఖాచిత్రాలు అందించిన శ్రీ భానుప్రకాష్‌కు అభినందనలు. పుస్తక ప్రచురణలో సహకరించిన పుజలోన ఫాబ్రికేటర్స్ సంస్థ చైర్మన్ శ్రీ పి. అచ్యుత్ పై గారికి, శాంత బయోటెక్ అధినేత డా॥ కె. ఐ. వరప్రసాద్ రెడ్డి గారికి నమోవాకాలు.

ఈ పుస్తకంలో ఏవైనా పొరపాట్లు దొరిలిన పక్షంలో మాకు తెలియపరిస్తే మలిముద్రణలో సవరించుకోగలమని మనవి.


భవదీయుడు
**డా॥సి.వి.రావు**

## కపిల మహర్షి రిసెర్చ్ ఫర్ రిసోర్స్‌స్
## ఇతర ప్రచురణలు












## విషయసూచిక


| | | |
|---|---|---|
| 01. | సాంఖ్య దార్శనికుడు - కపిల మహర్షి | 11 |
| 02. | జ్ఞానానికి మూడు ప్రమాణాలు | 12 |
| 03. | మూల పదార్థం కూడా భౌతికమే అయి వుండాలి | 13 |
| 04. | కార్యం కారణంలో దాగి వుంది | 15 |
| 05. | సమస్త ప్రపంచానికి ప్రకృతే మూలం | 16 |
| 06. | ప్రకృతి - పురుషుడు | 17 |
| 07. | దు:ఖ నివారణే లక్ష్యం | 22 |
| 08. | కైవల్యం అంటే ఏమిటి? | 23 |
| 09. | జ్ఞానోదయం వలననే ముక్తి | 24 |
| 10. | శ్రీకృష్ణుడు ప్రవచించిన “సాంఖ్యం” | 26 |
| 11. | కర్మను మానకు - ఫలితాన్ని ఆశించకు | 29 |
| 12. | కట్టిపడవేసే త్రిగుణాలు | 32 |
| 13. | “కపిలగీత” నేపథ్యం | 34 |
| 14. | దేవహూతి వేసిన ప్రశ్న | 37 |
| 15. | సాక్షీభావం అలవర్చుకుంటే దు:ఖం బాధించదు | 38 |

# 1.సాంఖ్య దార్శనికుడు కపిల మహర్షి



యోగసాధన అంటే కేవలం శరీరానికి సంబంధించిన కసరత్తు మాత్రమే అనుకోవడం పొరపాటు. మనసును, బుద్ధిని నియంత్రించడం కూడా యోగసాధనలో భాగమే. ఆ నియంత్రణకు ఒక లక్ష్యం ఉండాలి, ఒక గమ్యం ఉండాలి. దానికై మానవజన్మ గురించి, సృష్టిరహస్యం గురించి, సాధించవలసిన కార్యం గురించి పూర్తి అవగాహన ఉండాలి. జగత్తులో దుఃఖం, బాధ ఎందుకు కలుగుతున్నాయో, వాటిని నివారించడం ఎలాగో తెలుసుకోవాలి.

ఆ అవగాహనను తన సాంఖ్య దర్శనం ద్వారా కల్పించినది కపిల మహర్షి.

హిందూ మతం అనబడే విశాల వ్యవస్థకు చెందిన షడ్ దర్శనాలలో సాంఖ్యం ఒకటి. అదొక దర్శనం, ఒక తాత్విక చింతన. మానవునికి శాశ్వతంగా దుఃఖనివృత్తి, దానికి మార్గ దర్శనం–ఇదే సాంఖ్యాదర్శన లక్ష్యం.

షడ్ దర్శనాలు మూడు జంటలుగా వుంటాయి.

మొదటి జంట సాంఖ్య, యోగ దర్శనాలు.

రెండవ జంట వైశేషిక, న్యాయ దర్శనాలు.

మూడవ జంట పూర్వ, ఉత్తర మీమాంస దర్శనాలు.

ఈ ఆరు దర్శనాలలోను అన్నిటిలోకి ప్రాచీనమైనది సాంఖ్యం అని పండితుల అభిప్రాయం. క్రీ.పూ. 5వ శతాబ్దం నాటిదని బుద్ధచరితలో చెప్పారు.

అయితే సాంఖ్యదర్శన బీజాలు శ్వేతాశ్వరం, మైత్రాయణి ఉపనిషత్తులలో కనిపిస్తాయి. వాటిని విస్తరించి, పరిష్కరించి, ఒక గొప్ప దర్శనంగా తీర్చిదిద్ది ప్రపంచానికి ప్రసాదించిన ప్రవక్త "కపిల మహర్షి" అని ప్రతీతి. అందుకే దానికి 'కపిల సాంఖ్యము' అని పేరు వచ్చింది.

సాంఖ్యాశాస్త్రాన్ని కపిలుడు తన శిష్యుడైన ఆసురికి బోధించగా, ఆసురి తన శిష్యుడైన పంచశిఖునికి ఉపదేశించాడట.

"నాస్తి సాంఖ్య సమం జ్ఞానం" అని లోకోక్తి. సాంఖ్య దర్శనంతో సమానమైన

జ్ఞానం వేరే లేదని దాని అర్థం. అనేక గ్రంథాల్లో దాని ప్రస్తావన కనబడుతుంది.

సాంఖ్యంలో చెప్పిన పురుషతత్త్వం గురించి కఠోపనిషత్‌లో ఆత్మ అనే అర్థంలో చెప్పారు. శ్వేతాశ్వతార ఉపనిషత్‌లో సాంఖ్య గురించి, యోగ గురించి చెప్పారు. భగవద్గీతలో ద్వితీయాధ్యయంగా చెప్పారు. భారతంలో శాంతిపర్వంలో చెప్పారు.

## 2. జ్ఞానానికి మూడు ప్రమాణాలు



తర్వాతి రోజుల్లో కపిలుణ్ని విష్ణుమూర్తి 24 అవతారాల్లో ఒక అవతారంగా భాగవతం పేర్కొన్నా, ఆయన ప్రవచించిన సాంఖ్య దర్శనం మాత్రం నిరీశ్వరం. అంటే దానిలో దేవుడి ప్రసక్తి ఉండదు. 'ఈశ్వరా సిద్ధేహః' అని సాంఖ్య సూత్రాలు (1-92) పేర్కొంటున్నాయి. అంటే "ఈశ్వరుడు ఉన్నాడనే ప్రమాణం సిద్ధించటం లేదు" అని అర్థం. మరి దేవుడు లేకుండా సృష్టి ఎలా జరిగింది?

సాంఖ్యం ప్రకారం ప్రకృతి (మేటర్) నుంచే సమస్త విశ్వం వెలువడింది. ప్రకృతి అంటే మన చుట్టూ కనబడే చెట్లూ, చేమలూ, నదీనదాలు కాదు. సమస్త విశ్వానికి మూలం ఒకే పదార్థం. అది ప్రకృతి. అన్ని వస్తువులకు, అన్ని కార్యకలాపాలకు ముందు (ప్రాక్) ఉండేది ప్రకృతి. అది భౌతిక పదార్థం. కానీ అది ఇంద్రియాలకు అగోచరం. అంటే మన కంటికి కనబడదు, చెవికి వినబడదు. మరి అది వున్నట్టు ఎలా నమ్మాలి?

సాంఖ్యులు జ్ఞానానికి మూడు ప్రమాణాలను అంగీకరించారు. ఒకటి ప్రత్యక్ష ప్రమాణం. అంటే కన్ను, చెవి వంటి జ్ఞానేంద్రియాల ద్వారా లభించే జ్ఞానం. ఇది అందరికీ అర్థమయ్యేదే.

రెండవది అనుమాన ప్రమాణం. అంటే పూర్వానుభవం ద్వారా ఒక దాన్ని బట్టి మరొకదాన్ని ఊహించి తెలుసుకోవటం. ఆకాశం నిండా నల్లటి మబ్బులున్నాయి. అలాటి మబ్బులున్నపుడు గతంలో వాన పడింది. ఇప్పుడు మళ్లీ అలాటి మబ్బులే కనబడుతున్నాయి కాబట్టి వాన పడుతుంది అనుకోవచ్చు.

అలాగే దూరంగా ఒక చోట పొగ కనిపిస్తున్నది. నిప్పు ఉంటేనే పొగ వస్తుంది అని గతానుభవం చెప్తోంది. ఇప్పుడు పొగ ఉంది అంటే అక్కడ నిప్పు వున్నదన్నమాట. సముద్ర జలంలో ఒక నీటి చుక్కను రుచి చూస్తే అది ఉప్పుగా వుంది. అందుచేత సముద్రంలో ఉన్న నీటి నంతా రుచి చూసి తెలుసుకోనక్కర లేకుండా సముద్రపు నీరంతా ఉప్పు నీరు అని గ్రహిస్తాము. ఇవన్నీ అనుమాన ప్రమాణానికి ఉదాహరణలు.

మూడవది శబ్ద లేదా ఆప్తవచన ప్రమాణం. శబ్దం అంటే చప్పుడు అని కాదు. అప్పట్లో గొప్ప గ్రంథాలన్నీ వాక్ రూపంలో ఉన్నవే. ఎవరైనా గొప్ప పండితుడు పరిశోధన చేసి, సాధికారంగా ఏదైనా పుస్తకాన్ని వ్రాస్తే (శబ్దరూపంగా వెలువరిస్తే) దాన్ని ఆధారంగా స్వీకరించి జ్ఞానం సంపాదించవచ్చు. వేదాలలో ఉన్నదాన్ని మనం అంగీకరించడం శబ్ద ప్రమాణం క్రిందికి వస్తుంది. ఆప్తుడు అంటే ఎవరైనా జ్ఞాని లేదా మహర్షి చెప్పిన ప్రవచనం – ఆప్తవచన ప్రమాణం.

సాంఖ్యం ఆమోదించని ప్రమాణాలు మూడున్నాయి – ఉపమాన ప్రమాణం (పోలిక), అర్థపత్తి ప్రమాణం (పరిస్థితుల బట్టి ఆమోదించేది postulation, deriving from circumstances), అనుపలబ్ధి ప్రమాణం (non-perception, negative/cognitive proof)

## 3. మూలపదార్థం కూడా భౌతికమే అయి వుండాలి



వీటిలో ఏ ప్రమాణం ద్వారా ప్రకృతి నుంచే సమస్త సృష్టి తయారైంది అనే నిర్ధారణకు సాంఖ్యులు వచ్చారు? కంటికి కనబడదు కాబట్టి ప్రత్యక్ష ప్రమాణం పనికి రాదు, అలాగే ముందే లేదు కాబట్టి శబ్దప్రమాణమూ పనికి రాదు. ఇక మిగిలినది అనుమాన ప్రమాణం. దీని గురించి కాస్త విపులంగా తెలుసుకుందాం.

సాంఖ్యులు ప్రశ్నలు వేసుకుని తర్కం ద్వారా ఆలోచించారు. ఈ సమస్త విశ్వం, అందులోని అనంత కోటి వస్తువులు ఎక్కడ నుంచి వచ్చాయి? భగవంతుడు సృజించాడన్నది సరైన సమాధానం కాదు. ఎందుకంటే ఎంత భగవంతుడైనా 'లేని

దాని' నుంచి 'ఉన్న దాన్ని' ఎలా సృష్టిస్తాడు?

పూర్వానుభవం ద్వారా గమనించిన సత్యం ఏమిటంటే – శూన్యం నుంచి ఏదీ రాదు. ఉన్నదాని నుంచే మరొకటి ఏదైనా వస్తోంది. చెట్టు నుంచి చెట్టే పుడుతోంది, పశువు నుంచి పశువే పుడుతోంది, మనిషి నుంచి మనిషే పుడుతున్నాడు.

ఆ అనుభవాన్ని విశ్వానికి అన్వయిస్తే, ప్రపంచం లోని వస్తువులతో పాటు ప్రపంచం కూడా దానితో సమాన ధర్మం గల దాని నుంచే వచ్చి వుండాలి. కంటికి కనబడుతున్న పదార్థాలన్నీ భౌతిక పదార్థంతో (మెటీరియల్) నిర్మితమైనవి కనుక వాటికి మూలమైన పదార్థం కూడా భౌతికమే అయి వుండాలి.

కంటికి అనేక వస్తువులు కనబడుతున్నాయి. ఒకదానికి భిన్నంగా మరొకటి ఉంటోంది. కానీ మరీ భిన్నంగానూ లేవు.

వీటన్నిటికీ కారణమైనది ఏదో ఒకటి ఉండాలి. అది పరిమిత భేదాల్ని (లిమిటెడ్ వెరైటీ) పుట్టించే స్వభావం కలిగినదై ఉండాలి.

ఇవన్నీ దానిలోనే అవ్యక్తంగా ఉండి, సూక్ష్మంగా దాగి ఉండాలి.

పరిణామక్రమంలో అవి బయటపడుతూ ఉండాలి.

మట్టి నుంచి తయారయ్యే కుండ ఆ మట్టిలోనే ఉంటూ కొద్దికాలం పాటు కుండ రూపం ధరించి, తర్వాత మళ్లీ మట్టిగా మారి దానిలో కలిసిపోతోంది.

ఈ విధంగా ఆ 'కారణం' అన్ని కార్యాలకు ఆధారం అవుతుంది కానీ దాని స్వరూపంలో ఎప్పుడూ వ్యక్తం కాదు.

అది నిత్యం, వ్యాపకం, స్వతంత్రం.

అది ప్రకృతియై ఉండాలి. అది భౌతికమే అయి ఉండాలి.

సృష్టికి కారణమైన, శాశ్వతమైన అంశమైన ప్రకృతి అనాదిగా ఉంది. ప్రకృతిని ఎవరూ సృజించలేదు.

కాని ప్రకృతికి సృజించే లక్షణం ఉంది. అన్ని పరిణామాలూ, అశాశ్వతమైన పదార్థాలూ కూడా ప్రకృతి వల్లనే సంభవిస్తున్నాయి.

# 4. కార్యం కారణంలో దాగి ఉంది



ఈ ప్రతిపాదనను బలపరచడానికి సాంఖ్యులు "సత్కార్య వాదం" అనేదాన్ని ఉపయోగించుకున్నారు. ఇది కార్యకారణ (కాజ్ అండ్ ఎఫెక్ట్) సంబంధాన్ని నిర్వచించే సిద్ధాంతం.

కార్యం అంటే – చర్య, దాని ఫలితం. కారణం అంటే – ఆ పని జరగడానికి హేతువు. ఈ రెండూ వేరు వేరు కావు, ఒకటే అంటుంది సత్కార్యవాదం.

అంటే కారణంలో మొదటినుంచీ కార్యం అనేది గర్భితమై, దాగి వుంటుంది. అంతే తప్ప కొత్తగా, అప్పటి కప్పుడు పుట్టుకు రాదు.

మర్రి విత్తనంలో నుంచి మర్రి చెట్టు వస్తుంది. అంటే మర్రి విత్తనంలో మర్రి చెట్టు మొదటినుంచీ నిక్షిప్తమై వున్నదన్నమాట.

దాని అర్థం మర్రి చెట్టు సూక్ష్మ రూపంలో, చిన్న ప్రమాణంలో మీనియేచర్‌గా మర్రి విత్తులో వున్నదని కాదు. మర్రి చెట్టుగా పరిణమించటానికి తగిన లక్షణాలన్నీ మర్రి విత్తులో మొదటినుంచీ వున్నాయన్న మాట.

అలాగే బంగారపు గొలుసు కూడా! బంగారపు ముద్దలో అది నిబిడంగా, బయటకు వెలువడకుండా వుంటుంది.

ఈ విధంగా కార్యం అనేది కారణంలో మొదటినుంచీ గర్భితంగా వుంటుంది, వుండి తీరుతుంది.

అలా లేకపోయినట్లయితే దేని నుంచి ఏదైనా రావచ్చుగా !?

మట్టిలో నుంచి బంగారపు నగ రావచ్చుగా !?

మర్రి విత్తు నుంచి మామిడి మొక్క రావచ్చుగా!?

అలా రావటం లేదంటే బంగారపు నగ బంగారపు ముద్దలోను, మర్రి చెట్టు లక్షణాలు మర్రి విత్తులోను మొదటినుంచీ వున్నాయన్నమాట.

కార్యకారణ సంబంధం అంటే పరిణామమే (ఇవల్యూషన్) !

ఈ వాదాన్ని సత్కార్య వాదం అంటారు. సత్కార్యం అంటే మంచి పని అని అర్థం కాదు. సత్ – వున్నది, కార్యం – ఎఫెక్ట్.


ఉన్నదేదీ నశించదు. లేనిదేదీ ఉత్పన్నం కాదు. అంతా పరిణామమే. కారణంలో

ఫలితం అంతర్లీనంగా ఉంటుంది. వీరి 'ప్రకృతి పరిణామ వాదం' ప్రకారం మూల ప్రకృతి అన్నిటికీ కారణం. అదే క్రమంగా విభజితమై (ముక్కలుముక్కలుగా విడి) వివిధ పదార్థాలుగా పరిణామం చెందుతుంది. చివరిలో అన్నీ మళ్లీ అవిభాజిత (ముక్కలు కాని) మూల ప్రకృతిలో లీనమౌతాయి. ఇలా చక్రగతిలో విభజన, విలీనం సంభవిస్తాయి.

దీన్ని అనుసరించి సమస్త భౌతిక విశ్వం, భౌతిక వస్తువులు, భౌతిక ప్రకృతి నుంచి వచ్చాయని మనం ఊహించవచ్చు.

అయితే భౌతిక ప్రకృతి ఎలా వుంటుందో మనకు తెలియదు. భౌతిక వస్తువులు మాత్రమే మనకు కనబడతాయి. వాటిని బట్టి వాటికి కారణమైన, వాటితో సమాన ధర్మం గల ప్రకృతి ఎలా ఉంటుందో ఊహించుకోవాలి.

## 5. సమస్త ప్రపంచానికి ప్రకృతే మూలం



ఇక్కడో సందేహం రావచ్చు. ఈ భౌతిక ప్రపంచమంతా యదార్థంగా కంటికి కనబడుతోంది.

మరి దీనికి కారణమైన ప్రకృతిని మాత్రం ఊహించాల్సి వస్తోంది.

కేవలం ఊహల్లోనే ఉన్న ప్రకృతి కారణంగానే యదార్థంగా కనిపిస్తున్న ఈ భౌతిక ప్రపంచం ఆవిర్భవించిందని అనుకోమనడం అసంగతం కాదా? అసమంజసం కాదా? అన్న ప్రశ్న వస్తుంది.

ఈ ప్రశ్నకు గతకాలంలో అయితే సమాధానం చెప్పడం కష్టమే కానీ ప్రపంచమంతా అణువుల వలన, పరమాణుల వలన నిర్మితమైందని శాస్త్రీయంగా రుజువైన తర్వాత యీ విషయంలో సందేహాలుండ నక్కరలేదు.

ఈ అణు సిద్ధాంతం యిప్పటిది కాదు, ప్రాచీన కాలంలో గ్రీకు తత్వవేత్త డెమొక్రటీస్ ప్రతిపాదించాడు. వైశేషిక దర్శనాన్ని ప్రతిపాదించిన కణాదుడూ ప్రతిపాదించాడు.

కంటికి కనబడని పరమాణువులో, పరమాణు శకలాలో కంటికి గోచరించే ఈ సమస్త ప్రపంచం ఆవిర్భవించడానికి, నడవడానికీ కారణమని ఆధునిక భౌతిక

శాస్త్రవేత్తలు చెప్తున్నారుగా. అది కేవలం అనుమాన ప్రమాణంతోనో గణిత శాస్త్రాధారంగానో చెప్పినదే కదా!

అందువలన ప్రకృతి నుంచి, అంటే భౌతిక పదార్థం అనే మూలతత్వం నుంచి, ఈ సమస్త ప్రపంచం వచ్చిందనడంలో అసంగతం ఏమీ లేదు. అయితే ఎలా వచ్చిందనేది ప్రశ్న.

ఈ విశ్వం యొక్క తొలి తత్త్వం ప్రకృతే కాబట్టి దాన్ని ప్రధానం అన్నారు. అచేతనం కాబట్టి జడము అని కూడా అన్నారు. మాయ, సుషుప్తి అనే పేర్లతో కూడా పిలిచారు.

ప్రకృతి అచేతనం, అంటే తనంతట తాను కదలనిది. అయినా క్రియాత్మకం, సృజనాత్మకం, పరిణామాత్మకం. అంటే ఎవరైనా దానిలో ప్రేరణను కలిగిస్తే, క్రియకు లోనై సృష్టించగలదు, మార్పులు చెందగలదు. నిజానికి ప్రకృతి క్రమ పరిణామం చెందడంవలననే ప్రపంచం ఏర్పడింది.

స్త్రీ కూడా అంతే కదా. తనంతట తానుగా ఏదీ పుట్టించలేదు. పురుషుడు ఆమెలో ప్రేరణ కలిగించి, సంయోగిస్తే, ఆమె గర్భం దాలుస్తుంది. ఆమె శరీరంలో అనేక పరిణామాలు కలుగుతాయి. కొద్దికాలంలోనే ఆమె మరొక జీవిని సృష్టించగలుగుతుంది.

ప్రకృతి స్త్రీ అనుకుంటే ఆమెలో ప్రేరణ కలిగించి, సృజనకు ప్రేరేపించిన దెవరు? పురుషుడు! (కాన్షస్‌నెస్)

అతనెవరు?

## 6. ప్రకృతి – పురుషుడు



అంతటా వ్యాపించి ఉన్న స్వతంత్ర, నిరాకార ఆత్మ తత్వం పురుషుడు. దీనికి ఆడ మగ భేదం లేదు. **జీవంవున్న ప్రతి ప్రాణి "పురుషుడు" అనే నిర్వచించబడుతుంది.** అది అంతటా ఉంది, ఇంద్రియాలకు తెలియరానిది. మాటలలో చెప్పజాలనిది.

పురుషునకు ఏవిధమైన మాలిన్యాలు అంటవు. పురుషుడు శాశ్వతం. పురుషుని ఎవరూ సృజించలేదు. పురుషుడు దేనినీ సృజింపడు.

పురుషుడు శుద్ధ చైతన్య స్వరూపుడు. వేదాంతులు చెప్పే జీవాత్మ వంటి వాడు. అయితే వేదాంతుల దృష్టిలో జీవాత్మకు, పరమాత్మకు భేదం లేదు. 'అయం (నేను) ఆత్మా బ్రహ్మ' అనే మహా వాక్యాన్ని బట్టి ఆత్మయే బ్రహ్మ. అద్వైతంలో, పూర్వమీమాంసలో ఆత్మ ఒక్కటే.

కానీ సాంఖ్యం బ్రహ్మను ఒప్పుకోదు. ఆత్మ మాత్రమే వున్నది. అయితే ఆత్మ ఒకటి కాదు, అనేకం అంటుంది. ఆత్మ అంటే పురుషుడు.

పురుషుడు సచేతనుడు. ప్రకృతి అచేతనం.

పురుషులు అసంఖ్యాకులు కాగా, ప్రకృతి ఏకైకం, ఒకే ఒకటి.

పురుషుడు నిష్క్రియుడు, ప్రకృతి క్రియాశీలి.

పురుషుడు నిర్గుణుడు, ప్రకృతి త్రిగుణాత్మకం.

పురుషుడు భోక్త, ప్రకృతి భోగ్యం.

పురుషుడు ప్రపంచానికి సృష్టి కర్త కాడు. అతడు అప్రసవధర్మి. ప్రసవించే ధర్మం అతనిది కాదు. ప్రకృతి నుంచే సమస్త విశ్వం వెలువడింది.

అతడు స్వతంత్రుడు. అతని నెవరూ సృష్టించరు. అతను దేనినీ సృష్టించడు. అతనిని తెలియడం చాలా కష్టం.

**ప్రకృతిని ప్రేరేపించే త్రిగుణాలు**

ప్రకృతి తన సమీపంలో వున్న పురుషుడి నుంచి ప్రేరణ పొంది పరిణామం చెందుతుంది. ఆ పురుషునికి భోగ్య విషయంగా, అంటే ఆ పురుషుడు అనుభవించటానికి వీలుగా ఈ ప్రపంచాన్ని అది సృజించింది.

ప్రకృతికి ప్రేరణ ఎలా కలుగుతుంది?

ప్రకృతి త్రిగుణాత్మకం. ఆ మూడు గుణాలు సత్వ (స్థిరత్వం) –రజో (డైనమిజమ్, యాక్టివిటీ) –తమో (స్తబ్ధత) గుణాలు.

సత్వగుణం అంటే సమతుల్యత, బాలన్స్‌డ్‌గా ఉండడం

రజోగుణం అంటే – క్రియాశీలత, చురుకుతనం, వృద్ధిని, ప్రయత్నాన్ని పెంపొందిస్తుంది.

తమోగుణం అంటే – స్తబ్ధత, సోమరితనం, ప్రయత్నాన్ని నిరోధిస్తుంది.

ఇవి సమస్థితిలో (బాలన్స్‌డ్‌గా) వుంటే ప్రేరణ రాదు.

కానీ ఒకదాన్ని ఒకటి అతిక్రమించాలని ప్రయత్నించటంలో వాటి సమస్థితి చెదిరిపోయి, వైషమ్యస్థితి ఏర్పడి, ప్రకృతికి ప్రేరణ కలుగుతుంది,

ఈ గుణాల మధ్య తులనాన్ని బట్టి జీవుల, పదార్థాల లక్షణాలు మారుతాయి. పరిణామం జరుగుతుంది.

**పురుషుడు కర్త, అకర్త కూడా!**

ప్రకృతి ఈ క్రింది విధంగా పరిణామం చెందుతుందని సాంఖ్యులు ప్రతిపాదించారు. ప్రకృతి నుంచి పుట్టేవి రెండు రకాలుగా ఉంటాయి. పంచేంద్రియాల వంటివి యింకేమీ సృష్టించలేవు. కానీ బుద్ధి వంటిది అహంకారాన్ని, 'తను' అనే భావాన్ని సృష్టించగలదు.


ప్రకృతి నుంచి మొదటగా మహత్ (గొప్పది) బయల్వెడలుతుంది.

మహత్ అంటే బుద్ధి. దాన్నే మతి, ఖ్యాతి, జ్ఞానం, ప్రజ్ఞ అని కూడా అన్నారు.

బుద్ధి అంటే నిశ్చయాత్మకత. ఆలోచనతో కూడిన వివేచన దాని లక్షణం. ఇది మంచి, ఇది చెడు. ఇది కోరదగినది, ఇది కాదు అని నిశ్చయం చేస్తుంది.

ప్రకృతి అచేతనం అయినప్పుడు, దాని నుంచి దాని లక్షణాలకు విరుద్ధమైన బుద్ధి ఎలా ఉత్పన్నమవుతుంది?

ఈ ప్రశ్నకు సమాధానంగా "తత్సన్నిధానా దదిష్ఠాతృత్వం మణివత్" (1-96) అని సాంఖ్య దర్శనం జవాబు చెబుతున్నది.



అంటే సూదంటురాయికి దగ్గరగా వున్నప్పుడు ఇనుము ఎలా ప్రవర్తిస్తుందో అలాగ పురుషుని సన్నిధానంలో ప్రకృతి ప్రవర్తిస్తుంది. అంటే అయస్కాంతపు ప్రభావం వలన ఇనుము కూడా అయస్కాంతంలా మారినట్లే, పురుషుడు దగ్గర్లో ఉండడం చేత అతని చైతన్యం నుంచి ప్రకృతి ప్రేరణ పొంది చైతన్యవంతురాలై, బుద్ధిని ఆవిష్కరించగలుగుతుంది అని సాంఖ్యుల వివరణ.

దీని ప్రకారం పురుషుడు కర్త, అకర్త కూడా. అంటే తానుగా ఏమీ చేయడు కానీ, అయస్కాంతపు ఆకర్షణ వంటి గుణం కారణంగా ఒక క్రియకు కారకుడవుతాడు.

అటువంటి క్రియ కారణంగానే ప్రకృతిలోంచి మహత్ బయటపడుతుంది. దానిలో పురుషుడు ప్రతిఫలిస్తాడు, ప్రతిబింబిస్తాడు.

బుద్ధి నుంచి అహంకారం జనిస్తుంది. అహం అంటే "నేను" అనే స్పృహ. తాను వేరు, ఇతర ప్రపంచం వేరు అనే ఎరుక.

ఈ అహంకారం శాంత, ఘోర, విమూఢ అనే రకాలుగా కన్పిస్తుంది.

శాంతదశలో ప్రకాశం, ఘోరదశలో చంచలం, మూఢదశలో జడంగా ఉంటుంది.

అహం నుంచి త్రిగుణాల కారణంగా పదకొండు ఇంద్రియాలు, పంచతన్మాత్రలు, పంచ మహాభూతాలు బయల్వెడలతాయి.

సత్త్వగుణం కారణంగా పదకొండు ఇంద్రియాలు వికసిస్తాయి. అవేమిటంటే...

– పంచ కర్మేంద్రియాలైన – వాక్కు, చేతులు, కాళ్లు, పాయువు (విసర్జనేంద్రియం), జననేంద్రియం.

– పంచ జ్ఞానేంద్రియాలైన – నేత్రాలు, శ్రోత్రాలు, త్వక్కు (స్పర్శేంద్రియం), ముక్కు, జిహ్వ.

– పదకొండవది అంతరింద్రియమైన మనస్సు.

జ్ఞానేంద్రియాలు గ్రహించే విషయాల వికారమే మాత్రాస్పర్శలు. ఈ స్పర్శ కారణంగా దేహానికి శీతోష్ణభేదం తెలిసి, సుఖదుఃఖాలు ఏర్పడుతున్నాయి.

మాత్రలు పంచమహాభూతాలు – అంటే పృథ్వాప్యస్తేజో వాయురాకాశాలు (నేల, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం) – వికసించేందుకు దోహదపడుతుంది.

రజోగుణం కారణంగానే యీ వికసించే క్రియ జరుగుతుంది.

సత్యాన్ని సంఖ్యాపరంగా తెలియ జేస్తుంది కనుక ఈ శాస్త్రం సాంఖ్యం అయింది.

సాంఖ్యం మొత్తం 25 తత్త్వాలను పేర్కొంటోంది.

పురుషుడు, ప్రకృతి, బుద్ధి, అహంకారం, మనస్సు, – 5

తన్మాత్రలు – 5

జ్ఞానేంద్రియాలు – 5

కర్మేంద్రియాలు – 5

మహాభూతాలు – 5

మొత్తం 25

సాంఖ్యం అంటే సమ్యక్ (సమగ్రమైన) జ్ఞానం అని మరో అర్థం కూడా వుంది.

**ప్రకృతికి కారణం ఏది?**

ఇప్పుడు ప్రకృతి గురించి మరింత వివరంగా తెలుసుకుందాం.

ప్రకృతికి అవ్యక్తం అనే పేరు కూడా వుంది. అంటే వ్యక్తం కాని, బయటపడని మూల పదార్థం, మూల తత్త్వం అన్నమాట.

అవ్యక్తం నుంచి వ్యక్తమైనదే ఈ భౌతిక ప్రపంచం. ఈ సమస్త ప్రపంచానికి ప్రకృతే ఆధారం, అదే ముఖ్యం. అందుచేత దానికి ప్రధానం అనే మరొక పేరు కూడా వుంది.

కార్యకారణ సంబంధం అని చెప్పుకున్నాం. ప్రతి కార్యానికి ఒక కారణం ఉంటుంది అంటూంటాం.

మరి ప్రకృతికి ఏది కారణం అని అడిగితే? ఆ ప్రశ్న అర్థం లేనిది, అడగరానిది.

ప్రతి దానికి ఒక కారణం వున్నప్పటికి, అన్నిటికీ మూలమైన ఆదికారణం అనేది ఒకటి వుంటుంది అనుకుని ఊరుకోవాలి.

ప్రకృతికి కారణం అదే మాదిరి ప్రకృతి అంటారనుకోండి. 'మరి దానికి ఏది కారణం' అని అడిగితే, 'అదే మాదిరి ప్రకృతి' అనాలి. దానికి కారణం తిరిగి అదే మాదిరి...

ఇలాటి కారణాల తోరణానికి ఇలా ఎక్కడో ఒక చోట ఫుల్‌స్టాప్ పెట్టక పోతే అది అర్థరహితంగా, అనంతంగా సాగిపోతుంది.

అందుచేత మొదట్లోనే ఒక ప్రకృతితోనే సరిపెట్టుకోవాలి.

నిజానికి ప్రకృతి దేన్నీ తనంతటా తాను సృజించదు. పైన చెప్పినట్లు పురుషుడి కారణంగా అది పరిణామం చెందుతుంది. ఆ సంపర్కంతో అంతవరకు దానిలో అవ్యక్తంగా వున్న తత్త్వాలు వ్యక్తరూపం ధరిస్తాయి అంతే.

ప్రకృతి ఏకం, అనంతం, శాశ్వతం, సర్వవ్యాపకం, అపరిమితం, అవ్యక్తమే అయినా ప్రకృతిలో నుంచి వచ్చిన వేర్వేరు వస్తువులన్నీ పరిమిత పరిమాణం కలిగినవి, నశ్వరమైనవి, కారణ సహితమైనవి, అనేకమైనవి, అస్వతంత్రమైనవి, వ్యక్తమైనవి.

**భ్రాంతికి లోనయ్యే పురుషుడు**

ఇక పురుషుడి గురించి – పురుషుడు ఒకడు కాదు. అసంఖ్యాక పురుషులున్నారు. ప్రతి జీవి ఒక పురుషుడు. అతడు శుద్ధ చైతన్యస్వరూపుడు, నిష్క్రియుడు, నిర్గుణుడు అంటున్నాం.

అసలటువంటి వాడు ఒకడున్నాడని ఎందుకు, ఎలా ఊహించాలి?

ప్రకృతి తన్ను తాను ప్రపంచంగా, ప్రపంచంలోని వివిధ వస్తువులుగా పరిణమింపజేసుకుంటున్నది కదా!

దానికి కారణం ప్రపంచాన్ని పురుషునికి భోగ్య విషయంగా చేయడమే. లేకపోతే ప్రకృతి పరిణామానికి అర్థమే లేదు.

ప్రకృతి భౌతిక ప్రపంచంగా పరిణమిస్తున్నది కనుకనే దానికి ప్రేరణగా పురుషుడనే మూలతత్త్వం ఒకటి వుండవలసి వుంటుంది.

అంతేకాదు ప్రపంచంలో సర్వత్రా కనిపించే ఒక నిర్దిష్టక్రమం, నియమబద్ధతను బట్టి కూడా చైతన్య స్వరూపమైన పురుషుడి ప్రేరణను ఊహించవచ్చు.

ప్రకృతి పురుషుల సంయోగం పంగ్వంధుల సమన్వయంతో పోల్చారు.

గుడ్డివాని వీపు మీద ఎక్కిన కుంటివాడు గుడ్డివాడికి దారి చూపగలుగుతాడు, కానీ నడవలేడు.

గుడ్డివాడు నడవగలడు కానీ దారీతెన్నూ ఎరగడు.

అలాగే పురుషుడు చూడగలడు, కానీ నిష్క్రియుడు, నడవలేడు.

ప్రకృతి సక్రియం. క్రియాశీలత కలిగినది. కానీ చూడలేదు.

అందువలన యిద్దరూ కలిస్తేనే యిద్దరి ఉనికికి సార్థకత.

అయితే పురుషుడు నిష్క్రియుడు కదా, మరి ప్రపంచాన్ని ఎలా భోగిస్తాడు?

బుద్ధి అనేది ప్రపంచానికి, పురుషునికి మధ్య వాహిక. బుద్ధిలో ప్రపంచమంతా

నిక్షిప్తం. ఆ బుద్ధి పురుషునిలో ప్రతిఫలిస్తుంది. దాని ఫలితంగా పురుషుడు తానే బుద్ధి అని, తనకోసమే ప్రపంచం అనీ భ్రాంతికి లోనౌతాడు.

నిజానికి పురుషునికి ఏమీ అంటదు. కానీ అవివేకం వల్ల, అజ్ఞానం వల్ల ఆ భ్రాంతి కలుగుతుంది.

స్వచ్ఛమైన స్ఫటికం దగ్గర ఎర్రని పువ్వు వుంటే స్ఫటికం కూడా ఎర్రబడుతుంది. పువ్వును తొలగించగానే స్ఫటికం యథాప్రకారం తెల్లగా ప్రకాశిస్తుంది.

అలాగే పురుషుడు ప్రకృతికి సమీపంగా, దానితో కలిసి వున్నందునే, ప్రకృతినుంచి ఏర్పడిన ప్రపంచబంధం అతనికి తగులుకుంటుంది. దానితో పాటు అతనికి ప్రపంచ దుఃఖం కూడా అంటుకుంటుంది.

## 7. దుఃఖనివారణే లక్ష్యం



ప్రపంచం దుఃఖమయం. బుద్ధుడూ యిదే చెప్పాడు. ఏ మతం చెప్పినా, ఏ మతప్రవక్త ప్రవచించినా మానవ జీవితమనేది బాధాభాజనం (బాధాజనకం).

ఏ మతానికైనా లక్ష్యం ఒక్కటే – దుఃఖనివారణ, బాధానివృత్తి.

సాంఖ్య మతానికీ అంతే. సాంఖ్యం ప్రకారం దుఃఖం మూడు విధాలుగా వుంటుంది.

"అథ త్రివిధ దుఃఖాత్యంత నివృత్తి రక్త్యంత పురుషార్థ" అనే సూత్రంతో కపిల సాంఖ్యదర్శనం ప్రారంభమౌతుంది. అంటే మూడు విధాలైన దుఃఖాలను పూర్తిగా నశింప చేయటమే నాలుగు పురుషార్థాల (ధర్మ, అర్థ, కామ, మోక్ష) లోకి ముఖ్యమైన పురుషార్థం. అంటే మోక్షం అని చెప్తోంది.

దుఃఖత్రయం అంటే –

1) ఆధ్యాత్మిక దుఃఖం– వ్యాధుల వల్ల కలిగే శారీరక బాధలు, కామ క్రోధాదుల వల్ల కలిగే మానసిక బాధలు – ఆధ్యాత్మిక దుఃఖం.

2) అధిభౌతిక దుఃఖం–పాములు, పులుల వంటి క్రూరజంతువుల వల్ల కలిగే బాధలు, దొంగలు, హంతకులు, మోసకారులు మొదలైన వారి వల్ల కలిగే బాధలు అధిభౌతిక దుఃఖానికి కారణం.

3) అధిదైవిక దుఃఖం– అగ్నిప్రమాదం, ప్రయాణ ప్రమాదాలు, అతివృష్టి అనావృష్టి, తుఫానులు, వరదలు, పిడుగుపాటు వంటి ఎదురుచూడని సంఘటనలు అధిదైవిక


దుఃఖకారణాలు.

ఈ త్రివిధ దుఃఖాలను సాధారణోపాయాలతో తొలగించుకోవటం కష్టం కాదు. వైద్యంతో వ్యాధులను నయం చేసుకోవచ్చు. నదులకు ఆనకట్టలు కట్టి, కాల్వలు త్రవ్వి ఈతి బాధలను తగ్గించుకోవచ్చు. నిజమే, కానీ, ఇటువంటి ఉపాయాలన్నీ తాత్కాలికమైనవి. పైగా దుఃఖాన్ని తప్పకుండా తగ్గించి తీరతాయన్న హామీ యివ్వలేనివి.

మానవ జీవిత దుఃఖాలను ఇలాంటి సాధారణ ప్రాపంచికోపాయాలు శాశ్వతంగా తొలగించలేవు. శాశ్వత దుఃఖనివృత్తికి ఒకే మార్గం వున్నది.

అది సంసార లంపటం నుంచి పురుషుడు శాశ్వతంగా విముక్తుడు కావడం.

## 8. కైవల్యం అంటే..?



దేహం పడుతున్న అవస్థలన్నీ పురుషుడు లేక జీవాత్మ తనే పడుతున్నట్లు గందరగోళపడి, తానే ఈ ప్రపంచ సుఖదుఃఖాలను స్వయంగా అనుభవిస్తున్నానని భ్రమలో పడటం వల్లనే అతడు దుఃఖాలకు లోనౌతున్నాడు.

అజ్ఞానమే బంధాలకు, కష్టాలకు కారణం – అని మిగిలిన చాలా సిద్ధాంతాల లాగానే సాంఖ్యం కూడా చెబుతుంది. "పురుషుడు" (అనగా జీవాత్మ) శాశ్వతమైన, నిర్మలమైన చైతన్యం. ప్రకృతి వల్ల కలిగే సత్వరజస్తమోగుణాలు, మనసు, అహంకారము, మహత్‌లు ఈ జీవుని, శరీరంలో బంధించివేస్తున్నాయి.

నిజానికి ఆ దుఃఖాలు అవీ ప్రకృతికి సంబంధించినవి. తాను వేరు, తనకు ఏదీ అంటదు, తాను సాక్షిమాత్రుడు, శుద్ధ చైతన్య స్వరూపుడు అనే వివేకం పురుషుడిలో ఉదయించినప్పుడు, తాను ప్రకృతి కంటె వేరైనవాడు అనే జ్ఞానం కలిగినప్పుడు, అతడు ఈ బంధం నుండి, దుఃఖం నుండి విముక్తుడౌతాడు.

ప్రకృతి నుంచి వేరై ఒంటరినని గ్రహించడమే 'కైవల్యం' అంటారు.

ఈ ప్రకృతి వియోగం వివేకం వలన కలుగుతుంది. 'నేను జన్మించలేదు, నాకు శరీరము లేదు, నేను కర్తను కాను, నేను భోక్తను కాను' అనే అవగాహన కలగగానే 'అహం' లేకుండా పోతుంది.

అప్పుడు తన సహజలక్షణమైన నిర్గుణతత్వాన్ని అర్థం చేసుకుంటాడు.

దానివలన మోక్షం లభిస్తుంది.

అంటే తన తత్త్వం అర్థం కాగానే అతనికి మృత్యువు సంభవిస్తుందని కాదు. ఈ దేహం అనేది ప్రకృతికి యీయబడిన గతిఫలం.

అది వ్యయం అయేవరకూ దేహం ఉంటుంది.

ఆ తర్వాత అలాటి పురుషుడికి మరుజన్మ ఉండదు. కైవల్యప్రాప్తి కలుగుతుంది.

ఇక్కడ సాంఖ్యానికి, వేదాంతానికి మధ్య విభేదాలను గమనించవలసి ఉంది. అద్వైత వేదాంతం ప్రకారం బ్రహ్మమే అన్నిటికీ కారణం. అదే సత్యం. వేరే పదార్థం లేదు. జగత్తనేది మిథ్య, అశాశ్వతం.

కాని సాంఖ్యం ప్రకారం ప్రకృతి, పురుషుడు అనేవి రెండూ అనాదిగా వేర్వేరు. శాశ్వతమైన దానినుండి అశాశ్వతమైనది జనిస్తుందనే వాదాన్ని సాంఖ్యం అంగీకరించదు.

పాశ్చాత్య తత్వశాస్త్రంలో "కార్టీజియన్ సిద్ధాంతం" ప్రకారం శరీరం, మనసు అనేవి వేరు వేరు పదార్థాలు.

ఇది సాంఖ్యానికి కాస్త దగ్గరగా అనిపించినా కొంత ముఖ్యమైన భేదం ఉంది. ఆ సిద్ధాంతంలో "శరీరం" అనేది భౌతిక పదార్థం (మేటర్). "మనసు" కనిపించని చైతన్యం (కాన్షస్‌నెస్)

కాని సాంఖ్యంలో శరీరము, మనసు, అహంకారమూ అన్నీ ప్రకృతి (మేటర్) లక్షణాలే. "పురుషుడు", 'జీవుడు", "ఆత్మ" అనేది మరింత అంతర్గతంగా ఉండే చైతన్యం (కాన్షస్‌నెస్)

సంసారబంధంలో పురుషుడు చిక్కుకుని ఉండడానికి కారణం అవిద్య, అజ్ఞానం.

వివేకం సంపాదించడం ద్వారా దీనిని దూరం చేయవచ్చు. ప్రకృతికి, పురుషుడికి గల భేదాన్ని గుర్తించడం వలన అజ్ఞానాంధకారం తొలగిపోతుంది. సత్త్వగుణ ప్రధానమైన మోక్షం లభిస్తుంది.

## 9. జ్ఞానోదయం వలననే ముక్తి



అటువంటి జ్ఞానం కలగనంత వరకు పురుషుడు తిరిగి సంసార లంపటంలో చిక్కుకొని, జననమరణ చక్రంలో పడి తిరుగుతూ వుంటాడు.

చాలా భారతీయ మతాలలాగే సాంఖ్యం కూడా పునర్జన్మ, కర్మ సిద్ధాంతాలను

నమ్ముతుంది. పుణ్య, పాప కర్మల ఫలితాలను మరుచటి జన్మలో అనుభవించాల్సిందే అంటుంది.

పుణ్యకర్మల వల్ల కూడా ముక్తి కలగదు. కేవలం జ్ఞానోదయం వల్ల మాత్రమే మోక్షం లభిస్తుంది అని చెపుతుంది.

పునర్జన్మించేది ఏది ? మరణంతో స్థూల శరీరం నశించినా, అంతఃకరణ మొదలైన వాటితో కూడిన సూక్ష్మ శరీరం నశించదు.

దాన్నే లింగ శరీరం అని సాంఖ్యులు పేర్కొంటారు. మరణానంతరం ఆ లింగ శరీరమే మరొక స్థూల శరీరాన్ని ఆశ్రయించి పునర్జన్మిస్తుంది.

ఆ లింగ శరీరమే తానుగా భావించి పురుషుడు పునః సంసార సాగరంలో మునిగి తేలుతుంటాడు. ఇదంతా భ్రాంతి అని అతడు గ్రహించిననాడు అతనికిక సంసారం బంధం వుండదు. విముక్తుడౌతాడు.

ఊరికే 'తానువేరు, ప్రకృతి వేరు, ప్రపంచం వేరు, స్థూల, సూక్ష్మ శరీరాలు వేరు' అని భావించుకున్నంత మాత్రాన చాలదు. ఆ వివేకాన్ని సుస్థిరం చేసుకోవాలి.

అది అభ్యాసం వల్ల సిద్ధిస్తుంది. విరాగం వల్ల లభిస్తుంది.

దీన్ని సాధించటానికి యోగం ఒక మార్గం. అందుచేతనే సాంఖ్యం, యోగం జంట దర్శనాలయినాయి.

సాంఖ్య దర్శనానికి సాంఖ్యయోగం అని కూడా పేరు.

**ఈశ్వరుడున్నాడని ప్రమాణం దొరకలేదు**

కపిలుడు ప్రవచించిన సాంఖ్యదర్శనం నిరీశ్వరం.

ప్రకృతి, పురుషుడు గురించి యింత విపులంగా చెప్పిన కపిలుడు ఈశ్వరుడి గురించి ధాటీగా చెప్పలేదు.

వీళ్లిద్దరూ కాకుండా వేరే పురుషుడు లేదా ఈశ్వరుడు ఉన్నాడని ఎటువంటి రకమైన ప్రమాణమూ లభించడం లేదు అని చెప్పాడు. ఊహించడానికి కూడా ఏమీ లేదు అన్నాడు.

ఎందుకంటే పురుషులలో కొందరు ప్రకృతి గుణాలకు బద్ధులు, మరి కొందరు గుణాల నుండి ముక్తులు అయి ఉంటారు.

ఒకవేళ ఈశ్వరుడు ముక్తుడే అయివుంటే సృష్టి వంటివి చేయడానికి కావలసిన ప్రయోజనం కానీ, కోరిక కానీ ఉండదు.

ఒకవేళ బద్ధుడై అయి వుంటే సృష్టిని చేయలేదు.

నానా పురుషుల అధిష్ఠాతృత్వం వలననే ప్రకృతి సృజిస్తోంది.' అన్నాడు.

సాంఖ్య సూత్రాలకు ఈశ్వర కృష్ణుడు 72 కారికలు రచించాడు. ఆయన క్రీస్తు

శకం 2వ శతాబ్ది వాడు. ఆ గ్రంథంలో చెప్పబడినట్టిది నిరీశ్వర సాంఖ్యమే.

కానీ, తర్వాత కాలంలో మాత్రం ఎవరో దానిలో ఈశ్వర తత్వాన్ని కూడా చేర్చి సేశ్వరం (స ఈశ్వరం) చేశారు.

చరక సంహిత, భారతం, భాగవతం, భగవద్గీత మొదలైన గ్రంథాలలో కనబడే సాంఖ్య దర్శన వివరణ సేశ్వరం.

## 10 శ్రీకృష్ణుడు ప్రవచించిన సాంఖ్యం



వ్యక్తిరూపంగా చెపితే ఏ సిద్ధాంతమైనా తలకెక్కుతుందనే భావంతో కాబోలు మన పూర్వీకులు సాంఖ్యయోగాన్ని శ్రీకృష్ణుడి ముఖతః చెప్పించారు. దానికి భగవద్గీతను ఎంచుకున్నారు. భగవద్గీత మొదటి అధ్యాయంలో అర్జున విషాదయోగం ఉంటుంది. ఇందరు బంధువులను చంపి నేను నెత్తురు కూడు తినాలా? నేను యుద్ధం చేయను అని అర్జునుడు ధనుర్బాణాలు పడవేయడం మాత్రమే కనబడుతుంది ఆ అధ్యాయంలో. ఆ తర్వాత కృష్ణుడు అనేక విధాలుగా అతనికి నచ్చచెప్పి, జీవనతత్వాన్ని విశదీకరించి, కర్తవ్యోన్ముఖుణ్ని చేస్తాడు. ఆ ప్రబోధంలో మొట్టమొదటగా కృష్ణుడు ఎంచుకున్నది సాంఖ్యసిద్ధాంతాన్నే. అందుకే అది రెండవ అధ్యాయంలోనే ప్రారంభమవుతుంది.

సాంఖ్యంలో కపిలుడు చెప్పాడు – ప్రకృతికి సంబంధించిన గెలుపోటములను అవిద్య, అజ్ఞానం చేత తనవిగా భ్రమించినపుడు పురుషుడు దుఃఖానికి లోనవుతాడని. అలాటి స్థితిలో ఉన్న అర్జునుడితో ఉత్తమ పురుషుడైన కృష్ణుడు సంభాషిస్తున్నాడు. అతని మనోవేదనకు కారణమేమిటో చెప్పి, అతని భావనలో లోపమేమిటో చెప్పి, మందలించి, దానిలోంచి బయటపడమని మోటివేట్ చేస్తున్నాడు. నేటి సమాజంలో డిప్రెషన్‌కు లోనైన యువతకు కూడా పనికి వచ్చే ఉపదేశమిది...

'ఎక్కడిదీ కశ్మలం? ఎందుకీ దిగాలు? స్థితిగతులు విషమించినప్పుడు నీచులను ఆవహించే స్థితి యిది. పురుషులు యిలా నీరసపడరు. హృదయదౌర్బల్యాన్ని దూరంగా త్రోసి నిలబడు.' అని చివాట్లు పెట్టాడు. అయినా అర్జునుడు 'భీష్మద్రోణాది గురువులు, పెద్దలను చంపి సాధించే రాజ్యం లభించినా నా మనసు శోకించక మానదు. నేను యుద్ధానికి సుముఖంగా లేను' అని మొండికేశాడు. అప్పుడు కృష్ణుడు శోకం గురించి,

శోకించడంలో వివేకం గురించి ఉపన్యసించాడు.

‘అర్జునా! ఏదో పెద్ద పండితుడిలా, ప్రజ్ఞావంతుడిలా పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నావే! ఎవరు మరణించినా శోకించడం వృథా. ఎందుకంటే ఎవరు పోయినా, ప్రపంచం ముందుకు నడుస్తూనే ఉంటుంది, పండగలు, పబ్బాలు చేసుకుంటూనే ఉంటుంది. ఇవాళ ఉండి రేపు పోయేవాళ్ల కోసమా నువ్వు శోకిస్తున్నావు!? పండితులు బ్రతికి ఉన్నవారి కోసం కాని, చచ్చినవారి కోసం కానీ విచారించరు.’ అని చెప్తూ పండితుల లక్షణాల గురించి, చావుపుటుకల గురించి చెప్పాడు. చావుని మించిన దుఃఖం లేదు కాబట్టి ముందుగా దాని గురించి చర్చించాడు. దాని గురించి చింతించడం మానేస్తే, యిక తక్కినవన్నీ అంతగా మనసును బాధించేవి కావు.

‘బుద్ధిని ఆత్మయందు మాత్రమే లగ్నం చేసినవారు పండితులు. ఆత్మజ్ఞానికి రాగం శోకం ఉండవు. ఈ రెండూ నశిస్తే కానీ మనశ్శాంతి ఏర్పడదు. అప్పుడు కాని బుద్ధి సక్రమంగా నడవదు. ఈ రాజులు, నువ్వు, నేను యిప్పుడే వున్నామనీ, యికముందు లేమనీ, మళ్లీ యిక రాబోమనీ అనుకోవద్దు. ఈ దేహానికి బాల్యం, యౌవనం, వార్ధక్యం ఎలా ప్రాప్తిస్తాయో అలానే మరో దేహం కూడా లభిస్తుంది. ఈ రాజులకు కూడా గతంలో వేరే దేహం ఉంది, మరణానంతరం మరో దేహం లభిస్తుంది.

ఇంద్రియాలు గ్రహించే విషయాల వికారమే మాత్రాస్పర్శలు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు మాత్రలు. వీటిని చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు గ్రహించడాన్ని మాత్రాస్పర్శ అంటారు. ఈ స్పర్శ కారణంగా దేహానికి శీతోష్ణభేదం తెలిసి, సుఖదుఃఖాలు ఏర్పడుతున్నాయి. ఇవి శాశ్వతం కాదు, దేహమూ శాశ్వతం కాదు, ఆత్మ ఒక్కటే శాశ్వతం అని తెలిసినవాడే జ్ఞాని, ధీరుడు. వాడికి ద్వంద్వభీతి లేదు. అంటే వెలుగునీడలు, కష్టసుఖాలు.. యిలా జంటగా వచ్చేవాటికి భయపడడు, చెదరడు. రెండిటిని సమానంగానే చూస్తాడు.’ ఇలా చెప్పి ఆత్మ గురించి కూడా వివరించాడు.

### ఆత్మ నిత్యం, దేహం జీర్ణవస్త్రం

‘విశాల విశ్వవ్యాప్తమై ఉన్న శక్తి నశించేది కాదు. దాన్ని నశింపచేసే వాడెవరూ లేడు.

ఆత్మకు నాశనం లేదు ఎందుకంటే అది నిత్యం, అప్రమేయం.

దాన్ని ఆవరించి వున్న దేహమే నశిస్తుంది.

చిరిగిపోయిన పాతబట్టలను విడిచివేసి కొత్త బట్టలను కట్టుకున్నట్లే, జర్జరమైన ఒక దేహాన్ని విడిచి మరో దేహాన్ని ఆత్మ ధరిస్తుంది.

మరణం లేని, ఎల్లకాలావస్థలలోనూ ఉండే ఆత్మను చంపగలననీ, చంపాననీ అనుకునేవాడు అవివేకి.

ఆత్మ పుట్టుకే లేనిది, ఎన్నటికీ చావనిది, శాశ్వతమైనది.

ఇవాళ ఉంది కానీ రేపు ఉండదు అనుకోవడానికి లేదు.

ఇది అర్థం చేసుకుంటే చావడమూ లేదు, వేరేవారెవరో చంపడమూ లేదు.

ఎందుకంటే ఆత్మ అనేటువంటిదాన్ని బాణాలు ఛేదించలేవు, అగ్ని దహించలేదు, సముద్రాలు తడపలేవు, ప్రచండమైన గాడ్పులు ఎండగట్టలేవు.

అది పురాతనమైనది. అచలం. సర్వవ్యాపకం. స్థిరం. ఇంద్రియాలకు గోచరించదు. మనస్సుకి అందదు. ఏ వికారమూ పొందదు. అటువంటి దాని కోసం శోకించడం దేనికి?

ఒకవేళ యిది పుడుతూ చస్తూ ఉంటుందనుకున్నా అది సహజమే కనుక విచారించనక్కరలేదు. ఎందుకంటే పుట్టింది అంటే దాన్ని తరుముతూ చావు కూడా వస్తోంది కదా.

ఈ ప్రాణికోటికి ఆది ఏదో తెలియదు, అంతం ఏదో తెలియదు. ఇక మధ్యలో కనిపించేదాని కోసం విచారం దేనికి? అని ప్రశ్నించి, 'సుఖదుఃఖాలు, జయాపజయాలు, లాభనష్టాలు – వీటిని సమదృష్టితో చూస్తూ యుద్ధం నడిపితే పాపం చుట్టుకోదు' అని ఉపదేశించాడు కృష్ణుడు.

'ఇవన్నీ ప్రకృతికి సంబంధించిన వికారాలు, అశాశ్వతాలు' అనే దృష్టి అలవర్చుకుంటే మంచిది కానీ అంతమాత్రాన ఏ పనీ చేయనక్కరలేదు అనుకోవడం పొరబాటు. మనిషి తన ధర్మాన్ని తాను నిర్వర్తించవలసినదే. నిర్వర్తించేటప్పుడు ఎటువంటి దృక్పథం అలవర్చుకోవాలి అనేది కూడా కృష్ణుడు చెప్పాడు.

'కేవలం జ్ఞానం కానీ, కర్మ కానీ మోక్షం ప్రసాదించలేవు. రెండూ మోక్షసాధనకు అవశ్యం. దేని ప్రాముఖ్యత దానికి ఉంది.

కర్మకాండనే పరమార్థంగా భావించేవారు, తమ మనస్సును కోరికల మీదనే నిలిపి భోగభాగ్యాల కోసం కృషి చేస్తూ, పుడుతూ చస్తూ వుంటారు. వీరికి నిశ్చలమైన బుద్ధి ఉండదు. అవివేకులు వీరు.

కొన్ని చెట్లు పూలు పూస్తాయి కానీ ఆ పువ్వులు ఫలాలుగా మారవు. వీళ్లూ అలాటివారే. కర్మకాండ లోంచి జ్ఞానకాండలోకి ఎప్పటికీ రారు. వీరికి సమాధిస్థితి రాదు. జీవిత పరమలక్ష్యాన్ని సాధించడానికి వీరు అనర్హులు.

మనిషిలో సత్వ, రజస్తమో గుణాలు ఉంటాయి కాబట్టి అతను వేదాల్లో బాహ్యార్థాన్నే తీసుకుని, అసలైన జ్ఞానాన్ని విస్మరిస్తున్నాడు. ద్వంద్వాలకు అతీతుడైన జ్ఞానికి వేదాలన్నీ సులభంగా అందుతాయి. అతనికి చిన్నచిన్న విషయాలు అనవసరం. నదీతీరంలో ఉండేవారికి దాహం తీరడానికి చెరువుల, బావుల అవసరం ఏముంది?'

# 11. కర్మను మానకు, ఫలితాన్ని ఆశించకు



ఇక్కడ అతి గొప్పదైన సూక్తి చెప్పాడు కృష్ణుడు.

**'కర్మణ్యేవాధికారః తే, మా ఫలేషు కదాచన**
**మా కర్మఫల హేతుః భూః, మా తే సంగోస్త్వ కర్మణి'** అని.

నీకు కర్మ (డ్యూటీ) యందే అధికారం ఉంది. ఫలం మీద లేదు. ఫలంతో సంబంధం లేకుండా, ఫలితం మీద ఆశ పెట్టుకోకుండా నీ పని నువ్వు చేసుకుని పోవాలి. ఫలితం ఏమవుతుందో తెలియనప్పుడు పని చేయడం దేనికి అనే ఊహ రానీయకూడదు. కర్మ విడిచి చేతులు ముడుచుకుని కూర్చోకూడదు. ప్రతి కర్మకూ ఏదో ఒక ఫలితం కద్దు. అసలు కర్మయే తలపెట్టనివానికి ఏ ఫలితమూ రాదు. చేసే పని మీద మనసును లగ్నం చేయాలి కానీ ఫలితంమీద ఆసక్తి పెట్టుకోకూడదు.

ఇది యీ రోజుల్లో కూడా చాలా చక్కగా అన్వయిస్తుంది. ఎందుకంటే అనేక సందర్భాల్లో ఆశించిన ఫలితాలు రావు. రాకపోవడానికి సవాలక్ష కారణాలుంటాయి. ఒకసారి వచ్చింది కదాని మరోసారి వస్తుందన్న హామీ ఏమీ లేదు. అంత కింత వస్తే, యింతకు ఎంత వస్తుంది? అనే లెక్క పనికి రాదు. గతంలో కంటె ఎక్కువ కృషి చేశాను. అందువలన అప్పటి కంటె మెరుగైన ఫలితం వచ్చి తీరుతుంది అనుకున్న సందర్భాల్లో యిదివరకు కంటె తక్కువ ఫలితాలు వస్తూ ఉంటాయి.

అందువలన ఎటువంటి లెక్కలూ వేసుకోకుండా 'నా డ్యూటీ నేను చేశాను, మనసు పెట్టి చేశాను, ఒళ్లు దాచుకోకుండా, చిత్తశుద్ధితో, చేతనైనంత చేశాను. ఫలితం మన చేతిలో లేదు. ఎలా వచ్చినా స్వీకరిస్తాను.' అనే ఏటిట్యూడ్, మానసిక ధోరణి అలవర్చుకోకపోతే మానసికంగా కృంగిపోతారు.

ఫలాన్ని ఆశించి భంగపడకూడదని హితవు చెపుతూ కృష్ణుడు నొక్కి చెప్పాడు – 'ఫలం పట్ల కోరిక, ఆపేక్ష వారి దీనత్వానికి నిదర్శనం. ఫలాన్ని ఆశించి కర్మ చేసేవారు, ఫలాపేక్ష దృష్టి లేకుండా కర్మ చేసేవారి కంటె క్రింది స్థాయిలో ఉంటారు. నిష్కామకర్మ (కోరిక లేకుండా చేసే పని) చేసేవారు పాపపుణ్యాలకు అతీతులవుతారు. నిష్కామకర్మయోగంపై బుద్ధి నిలిపి, కర్మబంధాన్ని వదిలించుకునే జ్ఞానులు కర్మఫలాన్ని విడిచి జననమరణ రూపమైన సంసారవలయానికి దూరమై శ్రేయస్సులవుతారు.'

'మనుషుని బుద్ధిలోంచి మోహమాలిన్యం దూరమైనప్పుడు, త్రిగుణాత్మకమైన కర్మలపై

నీ మనసు పోదు. నీ బుద్ధిని ఆవరించి ఉన్న రకరకాల సిద్ధాంతాలను పారద్రోలి, దాన్ని నిశ్చలం చేసుకుంటే యోగం సిద్ధిస్తుంది. స్థితప్రజ్ఞుడు అవుతాడు.' అని కృష్ణుడు చెప్పగానే అర్జునుడు 'స్థితప్రజ్ఞుని లక్షణాలు వివరించ'మని అడిగాడు. అప్పుడు కృష్ణుడు చెప్పాడు –

– వాంఛను మనసులో ప్రవేశించనీయక ఆత్మతృప్తితో ఉండేవాడు స్థితప్రజ్ఞుడు.

– కష్టాలు మీదపడినా మనస్సు చలించదు.

– సిరిసంపదలు లభించినా వాటియందు ప్రీతి కలగదు.

– రాగద్వేషాలకు అతీతంగా ఉంటాడు.

– దేనిమీదా మమకారం లేకుండా కాలానుసారం వచ్చే మంచిచెడ్డలను నిశ్చింతగా స్వీకరిస్తాడు.

– తాబేలు తన అవయవాలన్నిటినీ లోపలకు ముడుచుకునే రీతిలో ఇంద్రియ వాసనలను అతను లోపలకు గుంజుకోగలుగుతాడు.


– అతని బుద్ధి స్థిరంగా ఉంటుంది.

– అహంకారానికి, మమకారానికి దూరమై చరిస్తాడు.

– ప్రాణికోటికి రాత్రి అనిపించే సమయం యోగికి పట్టపగలులా తోస్తుంది. వాళ్లకు పగలు అనిపించేది యోగికి రాత్రి అవుతుంది.

**ఇంద్రియ నిగ్రహం ఉన్నవానికే చిత్తశాంతి**

ఈ స్థితికి అతను ఎలా చేరతాడు అంటే –



ఇంద్రియాలకు ప్రాపంచిక విషయాలే ఆహారం. ఇంద్రియాలకు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను దూరం చేస్తే వాటిపై ఆసక్తి పోతుంది. పరబ్రహ్మపై మనసు లగ్నం చేయగలుగుతాడు.

ఇంద్రియాలను నిగ్రహించడానికి ఎంత ప్రయత్నిస్తున్నా యీ విషయవాంఛలు మరింత గాఢంగా మన మనస్సును లొంగదీయడానికి దూకుతూనే ఉంటాయి.

ఆ వాంఛలను స్మరించడం వలన వాటిపై ఆసక్తి. ఆసక్తి వలన అది పొందాలనే కోరిక. కోరిక తీరకపోవడం చేత క్రోధం. క్రోధం వలన మనసు చలించి అవివేకం కలుగుతుంది.

ఇదే స్మృతిభ్రంశకారణం.

ఇది బుద్ధినాశనానికి దారి తీస్తుంది. ఇక మనిషికి పతనమే.

దాన్ని నిరోధించడానికి పరబ్రహ్మను ఆశ్రయించాలి.

అప్పుడు మనస్సు స్వాధీనంలోకి వస్తుంది. మనస్సు స్వాధీనంలోకి వస్తే ఇంద్రియాలు

కూడా స్వాధీనంలోకి వస్తాయి.

అప్పుడు రాగద్వేషాలుండవు. చిత్తశాంతి లభిస్తుంది.

అప్పుడే బుద్ధి నిశ్చలంగా ఉంటుంది.

సముద్రం నీటితో నిండివుంటుంది. దానిలోకి ఎన్నో నదులు ప్రవేశిస్తాయి. అయినా దానిలో మార్పు ఉండదు.

అలాగే తత్త్వదృష్టి అలవడిన వాని చుట్టూ ఎన్నో కోరికలు తిరిగినా అతని చిత్తశాంతికి భంగం ఉండదు.

చంచలచిత్తునికి బుద్ధి నిలకడ ఉండదు. అందువల్ల బ్రహ్మభావన సిద్ధించదు. ఆ సిద్ధి లేనివాడికి చిత్తశాంతి, ఆత్మానందం ఉండవు.

ఇంద్రియాలు, విషయసుఖ వలయంలో చిక్కుకున్న మనస్సు పెనుగాలిలో ఊగిసలాడే నౌకలా అటూయిటూ పోతుంది.

అందువలన ముందు ఇంద్రియ నిగ్రహం పాటించాలి. అప్పుడే బుద్ధి స్థిరపడుతుంది.

**విద్యుక్తధర్మాన్ని విడువరాదు**

మోక్షసాధన అనగానే 'అన్ని పనులు మానుకుని, అందర్నీ విడిచి కొండల్లోకో, అరణ్యాల్లోకో పోయి తపస్సు చేసుకోవడం, అది మనవలన కాదు' అని అందరూ అంటూంటారు. కొండల్లోకి వెళ్లినా మనస్సు తన వ్యాపారాన్ని విడిచి పెడుతుందనుకోలేం. మనసులోంచి ఆ ఆలోచనలు తొలగిపోయేవరకూ, ఎంత తపస్సు చేసినా అతడు యోగి కాలేడు. మన జీవితానికి పరమార్థం మోక్షమే. దానిలో సందేహం లేదు. అయితే అది సాధించడానికి కర్మ (మన విద్యుక్తధర్మం) మాన నవసరం లేదు.

వాస్తవానికి ఇంద్రియాలు కర్మ చేస్తూనే ఉంటాయి. చేయకపోతే అవి నిర్వీర్యం అవుతాయి. అయితే వాటిని యిష్టం వచ్చినట్లు నడవనివ్వకుండా నియంత్రించాలి.

కర్మ చేస్తున్నా 'నేను చేసే కర్మకు కర్తను నేనే, దాని ఫలాన్ని నేనే అనుభవించాలి, నా వలననే యిది జరిగింది' అనుకోవడం కర్తృత్వ భోక్తృత్వ అహంకారం.


కర్మ చేస్తున్నా, కర్తృత్వబాధ్యత ఉండకుండా, యీ ప్రపంచంలో దేనినీ ద్వేషించకుండా, దేనియందూ వాంఛ లేకుండా సుఖదుఃఖాలు, రాగద్వేషాలు అనే ద్వంద్వాలకు అతీతంగా ఉండేవాడు కర్మచేత బంధింపబడడు.

సాంఖ్యం చెపుతున్నది యిదే.

లోకసంగ్రహ కర్మలు, పారమార్థిక కర్మలు చేస్తూనే ఆత్మయందు మనసు నిలపడం యోగం.

సాధన ద్వారానే ఆ యోగం సిద్ధిస్తుంది.

# 12. కట్టి పడవేసే త్రిగుణాలు



పురుషుణ్ని మోహబంధంలో కట్టిపడేసే గుణాలు మూడు – సత్వ, రజో, తమో గుణాలు.

ఈ మూడూ ఒకదాని కొకటి ఆశ్రయాలు, సహాయకాలు. మూడూ కలిసి పనిచేస్తాయి.

ఈ మూడూ కలిసి పురుషుణ్ని కట్టివేసే 'మహత్తు' వంటి తాళ్లను నిర్మిస్తాయి. తాళ్లను గుణం అని కూడా అంటారు కాబట్టి, వీటికి గుణాలు అనే పేరు వచ్చింది.

సమస్తమైన భౌతిక, మానసిక కార్యాలకు, సుఖదుఃఖ మోహాదులకు, గతి స్థితి వంటి అవస్థలకు – అన్నిటికీ యివే కారణం.

వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుని, ఒక సాక్షిలా వాటిని పరిశీలిస్తే గానీ వాటి నుంచి విడివడడం కష్టం.

భగవద్గీతలోని 14 వ అధ్యాయమైన గుణత్రయ విభాగ యోగంలో, 18వ అధ్యాయమైన మోక్షసన్న్యాస విభాగయోగంలో వాటి గురించి విపులంగా గీతాకారుడు చెప్పాడు.

సత్వ రజ స్తమో గుణాలలో సత్వగుణం నిర్మలమైనది, ప్రకాశింప చేసేది. అది ఆరోగ్యప్రదం కాబట్టి సుఖమందు ఆసక్తి కలది. సత్వగుణ సంపన్నులు పరమసుఖం పొందుతారు. ఆ విధంగా దేహిని బంధిస్తుంది. భూతకోటిలో విడివిడిగా విభక్తమైనట్లు ఉన్నా అది ఒక్కటే అనీ, అది నాశనరహితమనీ తెలుసుకోవడమే సాత్త్విక జ్ఞానం. రాగద్వేషాలు లేని మనస్సుతో కాంక్షారహితంగా ధర్మబద్ధంగా చేసేది సాత్త్విక కర్మ. అహంకారం, ఆసక్తి లేకపోయినా ధైర్యం, ఉత్సాహం ఉన్నవాడు, కార్యం సిద్ధించినా సిద్ధించకపోయినా సంతోషశోకాలకు లొంగనివాడు సాత్త్వికుడైన కర్త. తన కర్తవ్యాన్ని తాను శ్రద్ధగా నిర్వహిస్తూ, నిషిద్ధ కార్యాలకు దూరంగా ఉంటూ భయం బంధహేతువని, అభయం మోక్షసాధకమనీ తెలుసుకోవడం సాత్త్విక బుద్ధి. సత్త్వస్వభావం ఉన్నవాడు ఇంద్రియాలకు లొంగకుండా నిగ్రహం అభ్యసిస్తాడు. ఇది మొదట్లో దుఃఖంగా ఉన్నా చివరకు అమృతం అవుతుంది, ఆనందదాయకం అవుతుంది.

రజో గుణానికి అనురాగ స్వభావం. రాగం అంటే శృంగారం, స్నేహితులు, సంపదలు యిలాటి వాటిల్లో వుండే ప్రీతి. ప్రీతి కారణంగా పొందాలనే అభిలాష. అభిలాష కారణంగా మనసు సంకల్పవికల్పాలతో ఉంటుంది. కోరినవి దొరికితే సంతోషం, దొరకకపోతే దుఃఖం. అందుచేత ఆశలు, కోరికలు పుట్టి, కర్మ చేయాలనే ఆసక్తిని రగిలించి దేహిని బంధిస్తుంది. సర్వభూతాలలోనూ భిన్నంగా ఉన్నదాన్ని భిన్నంగా ఉందని అనుకోవడం (ఒక్కటే అని తెలుసుకోలేకపోవడం) రాజసజ్ఞానం. అహంకారంతో, ఫలాపేక్షతో క్లేశాలు పడుతూ చేసేది రాజసకర్మ. కర్మఫలాపేక్షతో, విషయాసక్తుడై, లోభియై, అపవిత్రుడై, హింసించే స్వభావంతో ఉంటూ కర్మఫలం లభించకపోతే దిగాలు పడుతూ ఫలసిద్ధితో సంతోషించేవాడు రాజసస్వభావుడైన కర్త. ధర్మాధర్మ జ్ఞానశూన్యతతో, కర్తవ్యం, నిషేధం తెలియకుండా ప్రవర్తించేది రజోగుణ ప్రధానమైన బుద్ధి. దీనివలన కర్మఫలం ప్రారంభంలో అమృతప్రాయం, చివరకు విషతుల్యం.

ఇక తమోగుణం – అజ్ఞానం నుంచి పుట్టి, అజ్ఞానాన్ని వృద్ధి చేస్తుంది. దీనివలన అజాగ్రత్త, సోమరితనం, నిద్ర పెరుగుతాయి. ప్రాణికోటిని మోహంలో ముంచి అవివేకంలోనే ఉంచుతుంది. ఆ విధంగా దేహి బంధితుడవుతాడు. సర్వమందూ ఉన్న పరమాత్మ ఒకడే అనే జ్ఞానం లేక ఏదో ఒక విషయమందు ఆసక్తితో అదే సర్వంగా భావించడం తామసజ్ఞానం. శుభాశుభ ఫలాలను ఊహించకుండా, ధననాశనాన్ని, పరహింసనూ గ్రహించకుండా తన శక్తిసామర్థ్యం తెలుసుకోకుండా అజ్ఞానంతో చేసేది తామసకర్మ. చపలచిత్తుడు, అవివేకి, జడబుద్ధి, మాయావి, ఇతరుల కార్యాలు ధ్వంసం చేసేవాడు, సోమరి, నిరంతరం విషాదంతో ఉండేవాడు, కార్యాన్ని గురించి ఆలోచనలు తెగనివ్వనివాడు తామసగుణ స్వభావుడైన కర్త. అధర్మాన్ని ధర్మంగా, ధర్మాన్ని అధర్మంగా ఊహించే బుద్ధి తామస గుణపూరితం. ఇలాటివాడికి ఏదీ సక్రమంగా కనిపించదు. నిజానికి యిది సుఖం కాకపోయినా అవివేకం చేత అతడికి సుఖమని తోస్తుంది.

## త్రిగుణాలకు అతీతుడు కావాలి

ఈ మూడు గుణాలూ ఒకదానితో మరొకటి ఘర్షిస్తూ తక్కిన రెండింటిని అణచాలని చూస్తూ ఉంటాయి. ఒక మనిషిలో తమో గుణం పెరిగితే నిర్వ్యాపారంగా అవివేకంతో, పరాకుతో చరిస్తాడు. చనిపోయేటప్పుడు తమోగుణం కలవారు పశుపక్షి జన్మలు పొందుతారు. చనిపోయేటప్పుడు రజోగుణానిది పైచేయిగా ఉంటే, వాళ్లు పై జన్మలో మధ్యమ జన్మ పొంది, కర్మఫలాసక్తితో జీవిస్తారు. సత్త్వగుణం పైచేయిగా ఉంటే ఉత్తమలోకాలు పొంది వచ్చే జన్మలో ఉత్తమ జన్మ పొందుతారు. త్రిగుణాల్లో ఏది

ఎక్కువగా ఉన్నా మరుజన్మ తప్పదు. మోక్షం రాదు.

త్రిగుణాలే కర్తలని గ్రహించి, తాను సాక్షి మాత్రమే అనీ, గుణాలకు అతీతమని గుర్తిస్తేనే మోక్షం వస్తుంది.

త్రిగుణాలకు అతీతుడిగా ఉండేవాడు ఏ లక్షణాలతో ఉంటాడని అర్జునుడు అడిగితే కృష్ణుడు చెప్పాడు –

"గుణాల వలన ప్రాప్తమయ్యే ప్రకాశం, కర్మప్రవృత్తి, మోహం – వీటిని ద్వేషించకుండా, ఆపేక్షించకుండా, ఉదాసీనంగా ఉంటూ..

సుఖాలకు పొంగకుండా, దుఃఖాలకు క్రుంగకుండా, ఆత్మావలోకన పరాయణుడై...

మట్టిని, రాయిని, బంగారాన్ని సమదృష్టితో చూస్తూ...

ధీరుడై, ఇష్టానిష్టాలు లేకుండా, లోకం నిందించినా, దూషించినా బాధపడక...

గర్వంతో ఉండనివాడు, ఆరాధించినా అవమానించినా, లక్ష్యం చెయ్యకుండా..

మిత్రశత్రుభావ రహితుడై కామ్యకర్మలవైపు దృష్టి పోనివ్వనివాడే – త్రిగుణాలకు అతీతుడు" అని.

## 13. "కపిలగీత" నేపథ్యం



కపిలుడు సాంఖ్యంలో చెప్పినదాన్ని భగవద్గీత భగవాన్ కృష్ణుడి ద్వారా చెప్పించింది. అయినా జ్ఞానమార్గం, నిష్కామ కర్మ అందరికీ అలవడడం కష్టమని తెలుసుకున్న పెద్దలు, భాగవతంలో మళ్లీ యీ సిద్ధాంతాన్ని "కపిలగీత" పేరుతో ప్రతిపాదించి యీ సారి భక్తిని రంగరించారు. భాగవతం భక్తిప్రధానమైన ఇతిహాసం. అందువలన కపిలగీత దానిలో చక్కగా యిమిడింది.

భాగవతంలో మూడవ స్కంధంలో "కపిలగీత" ఉంది. విష్ణువు కపిలుడిగా అవతారమెత్తి తన తల్లియైన దేవహూతికి ఆత్మజ్ఞానాన్ని బోధించినదే 'కపిలగీత'.

స్వాయంభూ మనువు, శతరూపల కూతురు దేవహూతి. భగవంతుని ఆవిర్భవింప చేసుకొనగల శక్తి గలదని ఆమె పేరే సూచిస్తోంది. ఆమె కర్దమ ఋషి యొక్క మహిమ విని, ఆయనను చూడకుండానే ప్రేమించింది. కర్దముడు బ్రహ్మ మానసపుత్రుడు. తీవ్రమైన తపస్సు చేశాడు. బ్రహ్మ సాక్షాత్కరించి దేవహూతి వివాహ

ప్రస్తావనను అంగీకరించి, సృష్టి కార్యాన్ని నిర్వహించమని ఆదేశించాడు. దేవహూతి తలిదండ్రుల కోరికపై కర్దముడు దేవహూతిని పెళ్లాడి, తొమ్మిదిమంది కుమార్తెలను కన్నాడు. అప్పుడు దేవహూతి తనకు ఒక పుత్రుణ్ని ప్రసాదించమని కోరింది. భగవంతుడు పుత్రునిగా జన్మించాలనే కోరికతో తపస్సు చేయమని కర్దముడు చెప్పాడు. తత్ఫలితంగా కొన్నాళ్ల తర్వాత సాక్షాత్తు విష్ణువే కపిలుడిగా ఆమె కడుపున జన్మించాడు. కర్దముడు భగవంతునిలో ఐక్యమయ్యాక దేవహూతి కుమారుణ్ని తనకు ఆత్మజ్ఞానాన్ని బోధించమని ప్రార్థించింది. అతను తల్లికి సాంఖ్యశాస్త్రాన్ని విశదీకరించాడు. ద్వంద్వాలు అంటని ఆధ్యాత్మికయోగాన్ని సాధించడానికి భక్తి కావాలని బోధించాడు.

**కపిలగీత చెప్పే సాంఖ్యం, భక్తియోగం**

కపిల గీత రెండవ అధ్యాయంలో కనబడే సాంఖ్యశాస్త్ర ప్రతిపాదనలివి –

సృష్టికి ముందు పురుషుడు అనాదియైన ఆత్మ. గుణరహితుడు, ప్రకృతికి అతీతుడు. పరమాత్మ, స్వయంప్రకాశుడు.

సుఖదుఃఖాల వంటి అనుభవాలకు అతీతుడు.

ఇప్పుడు కూడా అదొక్కటే ప్రపంచమంతా వ్యాపించి ఉంది.

ఆ పురుషుడే తన లీలలో భాగంగా త్రిగుణాలతో కూడిన సూక్ష్మ ప్రకృతిగా వ్యక్తమైనాడు.

*(కపిలుడి సాంఖ్యంలో ప్రకృతి (మ్యాటర్) వేరు, పురుషుడు (కాన్షస్‌నెస్) వేరు అని చెప్పబడింది. ఇక్కడకు వచ్చేసరికి పురుషుడే ప్రకృతిగా వ్యక్తమయ్యాడని మార్చారు)*

కార్యకారణ సంబంధానికి ప్రకృతే కారణం.

ప్రకృతి తన గుణాలచే తనలాగే ఉండే వివిధ జీవులను సృష్టిస్తోంది.

పురుషుడు యీ సృష్టిని చూసి పూర్తిగా మాయామోహితుడయ్యాడు.

ప్రకృతి గురించి దీర్ఘాలోచన చేయటం వలన, త్రిగుణాత్మకమైన ప్రకృతి చేస్తున్న కర్మలకు కర్తృత్వభావం వహిస్తున్నాడు.

దేనితో సంబంధం లేకుండా సాక్షీభూతుడిగా ఉంటూ ఆనందస్వరూపుడిగా ఉండవలసిన పురుషుడు సంసారంపై, కర్తృత్వభావంపై అభిమానం పెంచుకుని వాటికి బానిస అవుతున్నాడు.

సూర్యుడు నీటిలో పడినా మార్పు చెందడు. అలాగే పురుషుడికి ప్రకృతి ఉనికిపట్టు (స్థావరం) అయినప్పటికీ ప్రకృతి గుణాలచే ప్రభావితుడు కాడు. కాకూడదు.

కానీ అవిద్య, అజ్ఞానం చేత ప్రకృతి పట్ల విశేషమైన ఆసక్తితో, కర్మలను తనే ఆచరిస్తున్నానన్న భ్రాంతికి లోనవుతున్నాడు.

దానివలన నిస్సహాయుడై, సంసారలంపటంలో పడిపోయి, దుఃఖితుడవుతున్నాడు.

మమకారం వలన కర్మల యందు ఆసక్తి పెంచుకుని జననమరణ చక్రంలో పడుతున్నాడు.

ఈ విషయాసక్తికి అంతం లేదు. మనసు దీనిపై లగ్నం చేసినవాడు కలలో కూడా దుఃఖాన్నే అనుభవిస్తాడు. కల నుంచి మేల్కొనే వరకు అది కల అని తెలియదు. అలాగే అజ్ఞానం నుంచి బయటపడేవరకు అది అజ్ఞానం అని తెలియదు.

మనసును విషయాసక్తి నుండి బయటకు లాగాలంటే భక్తియోగం చేత, వైరాగ్యం చేత దానిని లొంగదీసుకోవాలి.

మొదటి అధ్యాయంలోనే కపిలుడు భక్తియోగం గురించి చెప్పాడు. అది కూడా కృష్ణుడి తరహాలో తనే దేవుణ్ణనే రీతిలో చెప్పాడు. –

'శుద్ధస్వరూపుడైన భగవంతుని చేరడానికి భక్తి అవసరం. అది ఇంద్రియాల సహాయంతో, శాస్త్రసమ్మతమైన కర్మలతో సాధించాలి. దానికి ఏకాగ్రత అవసరం. ఆ భక్తి సిద్ధుల కంటె గొప్పది. హేతురహితమైనది. కొంతమంది భక్తులు నాలో ఐక్యం చెందుదామనుకుంటారు. నా పాదసేవ చేయడంలో, నాకోసం పనులు చేయడంలో ఆనందిస్తారు. సాటిభక్తులతో కలిసి నా లీలలు తలుచుకుని ఆనందిస్తారు. నా సుందర దివ్యరూపాన్ని, కరుణాపూరితమైన నా నేత్రాలనూ చూస్తూ సంతోషపడతారు.'

సిద్ధాంతకర్తగా ఉన్న కపిలుడు తర్కబద్ధంగా తన వాదనను వినిపించాడు. ప్రకృతి, పురుషుడు అనే భావనను ఎందుకు ఊహించవలసి వచ్చిందో వివరించాడు. "కపిలగీత"కు వచ్చేసరికి అతన్ని విష్ణువు అవతారంగా చేసివేశారు కాబట్టి యిక భక్తి గురించే మాట్లాడాడు. సాంఖ్యంలో 'కర్మలు చేస్తూనే, తాను ప్రకృతి కంటె భిన్నమైనవాణ్ణని తెలుసుకుంటే పురుషుడికి మోక్షం వస్తుందన్నాడు' తప్ప 'దేవుడి పట్ల భక్తి ఉండాలి. శాస్త్రసమ్మతమైన కర్మలు చేయాలి' అని చెప్పలేదు. ఇక్కడ 'నా పాదసేవ చేసి తరించాలి' అంటున్నాడు.

తను భగవంతుడు కాబట్టి తనను సేవించే భక్తులను ఎలా కాపాడతాడో హామీలిచ్చాడు. 'నా శాంతస్వరూపాన్ని ధ్యానించే భక్తులు ఎన్నడూ నాశనం కారు. నన్ను ఉన్నతుడిగా, గురువుగా, సఖుడిగా, యిష్టదైవంగా కొలిచేవారిపై కాలచక్ర ప్రభావం ఉండదు. ఇహలోకపు ఐశ్వర్యాలను, లౌకిక వ్యవహారాలను విడిచిపెట్టి, అనన్యభక్తితో, ఏకాగ్రచిత్తంతో నన్ను సేవించేవారిని మృత్యువు నుంచి రక్షిస్తాను. తీవ్రమైన భక్తితో, మనస్సును నా యందు లీనం చేసినవారికి శ్రేయస్సు కలుగుతుంది.' అని.

# 14. దేవహూతి వేసిన ప్రశ్న



ఇలా చెప్పిన తర్వాత సాంఖ్యతత్వం చెప్పాడు, పురుషుడు ప్రకృతి నుంచి విడివడి, అజ్ఞానంలోంచి బయటపడాలి అని. అది విన్న తర్వాత దేవహూతికి సాధారణ మనుష్యులకు వచ్చే సందేహమే వచ్చింది.

'ప్రకృతి, పురుషుడు రెండు కూడా శాశ్వతమైనవే. పైగా ఒకరినొకరు ఆశ్రయించుకుని ఉంటారు. భూమి లేకుండా వాసనకు ఉనికి లేదు. నీరు లేకుండా రుచికి ఉనికి లేదు. అవే విధంగా యివీనీ. అలాటి పరిస్థితిలో ప్రకృతి పురుషుని బంధించి ఉంచి, విడవకపోతే ఎలా?

'పురుషుడు ప్రకృతి యొక్క గుణాలలో ఆసక్తుడై బందీగా ఉంటాడు అని నీవే చెప్తున్నావు. ఆ గుణాలు కలిగివుండి కూడా వాటిలోంచి పురుషుడు విముక్తుడు ఎలా అవుతాడు?

'వివేకం కలిగితే దుఃఖభయం, సంసారలోభం నివృత్తి అవుతాయంటున్నావు. అసలా భయం, లోభం కలగడానికి మూలకారణాలు ప్రకృతి గుణాలు. అవి నాశనం కాకుండా అలాగే వుంటున్నాయి కాబట్టి, మళ్లీ అదే భయం, అదే లోభం కలగదా?' అని దేవహూతి అడిగింది.

కపిలుడు చక్కటి ఉదాహరణతో ఆమెకు సమాధానమిచ్చాడు.

'ఆరణి (నిప్పు పుట్టించే చెక్క)లోంచి పుట్టిన నిప్పు, ఆ ఆరణినే దహించివేస్తుంది. అలాగే ప్రకృతి యొక్క గుణాల్లోంచి పుట్టిన ప్రకృతిబంధనం, ఆ గుణాలనే దహించివేయగలదు. రేయింబవళ్లు ఆధ్యాత్మిక సాధన చేస్తే, ఫలాపేక్ష లేకుండా కర్తవ్యం నిర్వహిస్తే, చిత్తాన్ని శుద్ధి చేసుకుంటే, భగవంతుని యందు గాఢమైన భక్తి ఉంటే, శాస్త్ర శ్రవణం నిరంతరం చేస్తూ ఉంటే, తనకు యివన్నీ అంటవనే జ్ఞానము, తీవ్రవైరాగ్యము, నిష్ఠతో కూడిన తీవ్రధ్యానము ఉంటే అది సాధ్యపడుతుంది.' అని.

ఇంకా చెప్పాడు – 'ప్రకృతిని అనుభవించి వదిలివేసిన తర్వాత దానిలో దోషాలను ఒక సాక్షిగా గమనించే వ్యక్తి తనలోని శుద్ధ చైతన్యంలో రమిస్తూ నిత్యానందంలో ఉంటాడు. దుఃఖానికి లోను కాడు. ప్రకృతి ఆ వ్యక్తిపై ఎలాంటి దుష్ప్రభావాన్ని చూపలేదు. నిద్రపోతూ ఉన్నవాడికి పీడకల దుఃఖం తెస్తుంది. నిద్రలోంచి మేల్కొన్నవాణ్ని ఆ దుఃఖం పీడించదు. అలాగే తను యిటువంటి వాటికి అతీతుణ్నని తెలుసుకున్నవాణ్ని ప్రకృతి ఏమీ చేయలేదు. అతను అమృతత్త్వంలో ఉంటాడు.'

# 15. సాక్షీభావం అలవర్చుకుంటే దుఃఖం బాధించదు



ఈ విధంగా కపిలుడి సాంఖ్యం అనేక రూపాలుగా ప్రజలకు చేరింది. ఏది ఏమైనా సాంఖ్యదర్శనం నొక్కి చెప్పేది – సృష్టి ప్రకృతి నుంచి వచ్చింది. ప్రకృతిని ఆ పనికి ప్రేరేపించినది పురుషుడు. ప్రకృతిలోని సత్త్వరజస్తమోగుణాల కారణంగా పురుషుడు తను చేసే పనులకు తనే కర్తననే భ్రమలో పడతాడు. జననమరణ చక్రంలో యిరుక్కుంటాడు.

దానిలోంచి బయటపడాలంటే అతను కర్మలు చేస్తూనే, ఫలాన్ని ఆశించకూడదు. సుఖదుఃఖాలు, రాగద్వేషాలు వంటి ద్వంద్వాలకు అతీతంగా వ్యవహరిస్తూ స్థితప్రజ్ఞత సాధించాలి. అప్పుడతన్ని ఏ రకమైన దుఃఖమూ బాధించదు. ఈ రకమైన స్థితప్రజ్ఞత సాధించడానికి యోగం ఎంతో ఉపకరిస్తుంది.

ఈ సిద్ధాంతం యీనాటి సమాజానికి కూడా ఎంతో అవసరం. టెన్షన్లు, డిప్రెషన్లతో కొట్టుమిట్టులాడుతున్న యీనాటి ప్రజలు నిరంతరం శారీరక, మానసిక వ్యాధులతో బాధపడుతూ వ్యసనాలకు బానిసలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కపిల మహర్షి ప్రవచించిన "సాంఖ్యదర్శనం" వారికి సరైన మార్గాన్ని గోచరింపచేస్తుంది. వేలాది సంవత్సరాల క్రితమే కాదు, యిప్పటికీ కపిలుడు ఆరాధ్యుడు, అనుసరణీయుడు. మానవాళి శ్రేయస్సు కోరి సాంఖ్యాన్ని ప్రవచించిన ఆ మహర్షికి, ఆ ద్రష్టకు వేనవేల నమోవాకాలు.

ఈ లోకంలో ఎందరు ఆధ్యాత్మిక వేత్తలు, ప్రవచనకర్తలూ, సంఘసంస్కర్తలూ సామూహిక ప్రజా హితం కోసం, భక్తజనం కోసం, ఆత్మీయగణం కోసం ఆరాటపోరాటం చేస్తున్నా – కపిలుని సాంఖ్యతత్వాన్ని బట్టి – ఎవరికి వారు స్వతఃసిద్ధంగా ఆత్మజ్ఞానం పొందగలిగినప్పుడే జీవితంలో సాక్షీభావం ఏర్పడి – తన స్వధర్మయుతమైన పాత్రలో జీవనసౌందర్యాన్ని చవి చూడగలరు. ఆత్మజ్ఞానానికి పెద్దలు నిర్దేశించిన మార్గం – యోగసాధన!

**సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చల తత్వే జీవన్ముక్తి :**

*– ఆది శంకరాచార్య*

**శుభం భూయాత్**

**డా॥ సి.వి.రావు**

# K M R R- YOGA COURSES

| | |
|---|---|
| 1- Diploma in Yoga Teacher Courses (**D.I.Y**) | 6 months |
| 2- Specialist -Yoga Therapy Specialised Courses (**Y.T.S.C**) | 2 months |
| 3- Yoga Training for P.G.D / M.Sc. Yoga University Students | |
| 4- Professionalism - Yoga Certification Courses | 32 hours |



**Dr. P. Usha Bala**
TTC Board Chairman,
Faculty of Diabetes & Obesity

**SELF -HEALTH**
**MANAGEMENT COURSES**
7 Days - Specially Focused On Lifestyle Disorders.

## EXCELLENT FACULTY

| | |
|---|---|
| Dr.C.V.Rao | Yogic Science, Saankhya Phylosophy |
| Dr. Ch. Vasanth Kumar | Stress Management |
| Dr.Y.Sravan Kumar | Anatomy & Physiology |
| Dr. M. Ajay Kumar | Neurology & Life Style |
| Mrs. D. Sunitha | P.C.O.D / Prenatal Yoga |
| Mrs. P. Rekha (M.Sc. Yoga) | Yoga Teaching Skills |

& Senior Yoga Profesionals @ KMRR

Contact Ph : **98499 77607** e-mail: contact@kapilayoga.org
website : www.kapilayoga.org

## KMRR-YOGA SERVICES

* FREE Yoga sessions for Disease-wise patients
* FREE Yoga & Health Camps in City & rural areas
* Smarana Yoga classes for School Children & parents counselling
* Provision of Door-Step Yoga services for groups & families
* Scholarships provided for talented poor students, blind, handicapped

**Corporate Yoga Sessions @ I. T. & Industries**

KMRR is a voluntary organization.
Your kind Donations are Tax exempted
under section 80-G of the I.T. Act,1961

**SMARANA YOGA (FOR CHILDREN)**
**Sundays - Timing : 11:30 to 1:00 P.m.**

**REGULAR YOGA CLASSES @ KMRR**

Morning 6-00 to 7-00 am , 7-00 to 8-00 am (group)
Evening 4-30 to 5-30 pm Therapy class for ladies.
( Monday to Friday )

**Contact Ph : 98499 77607**
**Website : www.kapilayoga.org**
**e-mail : contact@kapilayoga.org**

*Best wishes from :*

PUZZOLANA

**PUZZOLANA MACHINERY FABRICATORS**
Puzzolana Towers, Sumedha Estates, Avenue - 4
Street No. 1, Raod No. 10, Banjara Hills, Hyderabad-500034
+91-40-2335 3983, enquiry@puzzolana.net